విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

శుక్రవారం 11 ఏప్రిల్ 2025 8 పేజీలు

పేదల కోసం సీపీఐ నిరంతర పోరు

సామర్లకోటలో సీపీఐ ప్రచారజాత

విశాలాంధ్ర - సామర్లకోట : భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సామర్లకోట విఘ్నేశ్వర టాకీస్ వీధిలో పట్టణ సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్దిరెడ్ల సత్యనారాయణ అధ్యక్షతన గురువారం ప్రజా సమస్యలపై సీపీఐ ప్రచార జాతను ప్రారంభించారు. ఈ జాతాకు ముఖ్య అతిథులుగా సీపీఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ హాజరయ్యారు. బోడకొండ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల చరిత్ర గల పార్టీ అన్నారు. ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు చేసిన ఘనమైన చరిత్ర పార్టీకి ఉందని, భూ పోరాటాలు, దున్నేవాడికి భూమి, గ్రామీణ ఉపాధి హామీ పథకాలు, బ్యాంకుల జాతీయకరణం తదితర అనేక రకాల ఉద్యమాలు చేసింది భారత కమ్యూనిస్టు పార్టీ అని గుర్తు చేశారు.

అర్హులైన పేద ప్రజలందరికీ గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు భూమిని, అర్బన్ ప్రాంతాల్లో రెండు సెంట్లు భూమిని ప్రభుత్వం కేటాయించి ఇళ్ల నిర్మాణానికి 5 లక్షల రూపాయలు లోన్లు కేటాయించాలని అన్నారు. తోకల ప్రసాద్ మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో వాగ్దానంలో భాగంగా ఉచిత గ్యాస్ పంపిణీ పథకం అమలు చేస్తూనే మరోపక్క దొడ్డి దారిన నడ్డి విరిచే చందంగా గ్యాస్ పై రూ. 50 అదనంగా పెంచి సామాన్య ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారని అన్నారు. పెట్రోల్, డీజిల్, నిత్యావసర ధరలు వెంటనే నియంత్రించాలని, సామాన్య ప్రజలకు సన్నబియ్యం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రచార జాతాలో సీపీఐ జిల్లా నాయకులు కేశవరపు అప్పలరాజు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు సూరిబాబు, మడగల రమణ, పెద్దిరెడ్డి అర్జున్‌రావు, సమ్మి సత్యనారాయణ, అడపా చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ ధర పెంపు ఉపసంహరించాలి

కాకినాడలో సీపీఐ నిరసన

విశాలాంధ్ర - కాకినాడ : కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, ఇంటి పన్ను, కరెంట్ బిల్లు తోపాటు వంట గ్యాస్ పై 50 రూపాయలు పెంచడాన్ని నిరసిస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ కాకినాడ జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం స్థానిక మదర్ థెరిసా సెంటర్ వద్ద నిరసన తెలిపారు. తొలుత కొత్తకాకినాడ నుండి ప్రారంభమైన ప్రదర్శన రామాలయం, డైరీ ఫారం రోడ్డు, ఏల్చూరి ▶మిగతా 2లో..

పెంచిన ఆస్తి పన్నులు తగ్గించాలి

చలసాని వెంకట రామారావు డిమాండ్

విశాలాంధ్ర- నూజివీడు టౌన్ : పట్టణాలలో పెంచిన ఆస్తి పన్నులు వెంటనే తగ్గించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక అమర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెంచిన

ఆస్తి పన్ను వల్ల పట్టణాలలో నివసిస్తున్న పేద, మధ్య తరగతి ప్రజల పై పెనుభారం పడిందన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 15శాతం అదనంగా పన్ను భారం పెరిగిందన్నారు. గుట్టు చప్పుడు కాకుండా ప్రభుత్వం పెంచిన ఆస్తి పన్ను వల్ల పట్టణ పేద ప్రజలపై 320 కోట్ల రూపాయల అదనపు భారం పడిందన్నారు. ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు ఆస్తి పన్ను పెంచబోమని హామీ ఇచ్చి ప్రభుత్వ ఏర్పాటు చేసిన తర్వాత మాట తప్పిందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు ▶మిగతా 2లో..

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర -భీమవరం: పాలకులవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల్లో అవగాహన కలిగించి చైతన్యపరచాలని, ఇదే సందర్భంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం ప్రజలతో పని చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. భీమవరం పట్టణ మున్సిపల్ వర్కర్స్, సిపిఐ శాఖా మహాసభ గురువారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించారు. శాఖా మహాసభకు యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కోనాల మాట్లాడుతూ కుల మత, ధనిక పేద అసమానతలు లేని, దారిద్ర్యం లేని సమసమాజం కోసం భూమి కోసం భుక్తి కోసం పేద ప్రజల విముక్తి కోసం సిపిఐ 1925 నాటి నుంచి నేటి వరకు అలుపెరుగని పోరాటం చేస్తుందన్నారు. సీపీఐ వందేళ్ల పండుగ సందర్భంగా పార్టీ చేసిన త్యాగాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, స్థానిక ప్రజలతో మమేకం కావాలని

ఇదే సందర్భంలో అధికారుల దృష్టికి తీసుకువెళ్లి స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోనాల సూచించారు. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సమానత్వం,సౌభ్రాతృత్వం లక్ష్యంగా వున్న రాజ్యాంగ పరిరక్షణ అందరి ధ్యేయం కావాలని ఈ దిశగా ప్రజలను కార్యోన్ముఖులను చేయాలని కోనాల అన్నారు. కార్మికుల హక్కులను కాలరాసి నాలుగు లేబర్ కోడ్లు తెచ్చి వారిని రోడ్డున పడేశారని, నల్ల సాగు చట్టాలను తెచ్చి వ్యవసాయాన్ని కార్పోరేటీకరించడానికి ప్రయత్నాలు చేస్తున్నారని కోనాల విమర్శించారు. ధరలను అదుపుచేయలేని, ఉద్యోగం, ఉపాధి కల్పించలేని, ప్రజా ▶మిగతా 2లో..

అర్జీల పరిష్కారంలో జవాబుదారీతనం ఉండాలి

కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : ఏదైనా ఒక సమస్యవస్తే దాని స్థాయిని కూడా అంచనా వేసి ఆ స్థాయిలో ప్రతిస్పందన ఉంటే తప్పకుండా పరిష్కారం అవుతుందని, హేతుబద్ధత కలిగిన పరిష్కారం చేసినప్పుడే భూ సమస్యలకి, ఇతర సమస్యలకు పరిష్కారం సాధ్యం అవుతుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం జిల్లా కలెక్టర్ ప్రశాంతి అధ్యక్షతన రెవెన్యూ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అంశాల పరిష్కార మార్గాలపై వర్క్‌షాపు (కార్యశాల) జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు, డిఆర్వో టి. సీతారామ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రెవెన్యూ అధికారులు కార్యశాల నిత్యకృత్యమైన సమావేశాలలా కాకుండా ఫలవంతం అయ్యే విధంగా ఒక నిర్ణాయక పాత్ర పోషించాలని ఆదేశించారు.

సమస్య పరిష్కారం కోసం ఎస్ వో పి (ప్రామాణిక ఆపరేటింగ్ విధానం) మార్గదర్శకాలు జారీ చేయడం జరుగుతుందని, అయితే వాటిపైనే ఆధారపడకుండా క్షేత్ర స్థాయిలో రెవిన్యూ అధికారులు సముచిత నిర్ణయం తీసుకోవడం ద్వారా తదుపరి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వాటి ఆచరణాత్మక విషయాలను పరిగణన లోనికి తీసుకోనున్నట్టు వెల్లడించారు. భూముల విషయంలో సర్వే నంబర్, ఎల్ పి ఎం నెంబర్ ప్రకారం సబ్ డివిజన్ చెయ్యాల్సి ఉందన్నారు. తాళ్లపూడి మండలం లో వైట్ ఫీల్డ్ స్థలాలు ఇతరులకి కేటాయింపు చెయ్యాలని , అనపర్తి నియోజక వర్గంలో వ్యర్థాల నుంచి సంపద సృష్టి కోసం కేటాయించిన భూములు కేటాయింపు చెయ్యవద్దు అని పిజిఆర్ఎస్ లో విభిన్న అర్జీలు ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు మాట్లాడుతూ, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న అర్జీలను సత్వర పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం, సీసీఎల్ఏ కమిషనర్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. సమస్య పరిష్కారం దిశలో అధికారుల స్థాయిలో కాకుండా క్షేత్ర స్థాయి నుంచి సమగ్ర సమాచారం తెలుసుకుని పరిష్కారం చూపాలని సూచించారు ఈ కార్యశాలలో జిల్లా రెవెన్యూ అధికారి టి సీతారామ మూర్తి, కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్ భాస్కర్ రెడ్డి, ఆర్డీవోలు కృష్ణ నాయక్, రాణి సుస్మిత, జిల్లా ల్యాండ్ అండ్ సర్వే అధికారి బి. లక్ష్మీనారాయణ , 19 మండలాల తహసిల్దార్, మండల సర్వే అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేస్తాం

జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి

విశాలాంధ్ర-ఏలూరు: 2024-25 రబీ సీజనులో పంట ఉత్పత్తులకు ప్రభుత్వంచే నిర్ణయించిన కనీస మద్దతు ధర అందేలా జిల్లా వ్యాప్తంగా తగు ఏర్పాట్లు చేశామని, పప్పు ధాన్యాల కొనుగోలుకు సైతం ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా ఆర్ఎస్‌కే, సహకార సంఘాల సమన్వయంతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. దళారుల బెడద లేకుండా రైతులకు న్యాయం చేసేందుకు సదరు కొనుగోలుకు

బయోమెట్రిక్ తప్పనిసరిగా అమలు చేయబడుతోందని, సేకరించిన ఉత్పత్తులను సులభంగా ట్రాక్ చేయడానికి వీలుగా సంచులకు క్యూఆర్ కోడ్/ఆర్ఎఫ్ ఐడీ ట్యాగ్ కూడా వేస్తున్నారని తెలిపారు. జిల్లాలోని దెందులూరు,పెదపాడు,ఏలూరు మండలాలలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా 1,922 మెట్రిక్ టన్నుల పెసలను సేకరించాలనే లక్ష్యాన్ని నిర్ధారించగా, ఇప్పటికే సదరు లక్ష్యాన్ని అధిగమించి 2,095 మెట్రిక్ టన్నుల ▶మిగతా 2లో..

ప్రతి గర్భిణీ పౌష్టికాహారం తీసుకోవాలి

విశాలాంధ్ర - గణపవరం: ప్రతి గర్భిణీ స్త్రీ పౌష్టిక ఆహారం తీసుకోవాలని ఐసిడిఎస్ గణపవరం మండలం పిప్పర సెక్టార్ సూపర్వైజర్ సిహెచ్ దుర్గ భవాని గురువారం అన్నారు. ప్రభుత్వం అత్యంత

ప్రతిష్టత్మకంగా చేపట్టిన 7వ పౌష్టికాహార పక్షోత్సవాలను ఈ నెల 8 తేదీ నుండి 22 తేదీ వరకు మండలం లోని ప్రతి అంగన్వాడీ సెంటర్‌లో గ్రామాల వారీగా జరగనున్నాయని ఆమె అన్నారు. పిప్పర గ్రామంలో పిప్పర -8 అంగన్వాడీ సెంటర్ లో పోస్టికహార పక్షోత్సవాలా కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భవతులకు రూ 1000 పాటు గర్భస్థ దశ నుండి 2 సంవత్సరాలపాటు పౌష్టికాహారం తీసుకోవడానికి శ్రద్ధ వహించేలా అవగాహనా కల్పించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఎన్. పద్మావతి, ఆర్. రాజ్యలక్ష్మి ,తల్లులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన సదస్సులు

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం : రబీ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలుపై పంగిడిగూడెం, లక్కవరం, పేరంపేట, గుర్వాయిగూడెం గ్రామాల్లో గురువారం రైతులకు ధాన్యం కొనుగోలుపై జంగారెడ్డిగూడెం తహశీల్దార్ కె. స్లీవ జోజి అధ్యక్షతన అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ

సదస్సులలో పాల్గొన్న జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారిణి డి.వెంకటరమణ లక్కవరం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ధాన్యం కొనుగోలుకు సంబంధించిన పరికరాలను, గోనె సంచులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తాము పండించిన ధాన్యం ప్రభుత్వం వారు నిర్దేశించిన రేటు అనగా క్వింటా ధాన్యం రూ.2300 అమ్ముకోవాలని తెలిపారు.జాయింట్ కలెక్టర్, ఏలూరు వారి ఆదేశాల ప్రకారం గోనెసంచులు గౌడౌన్ ను ముందుగానే ఏర్పాటు చేసి సంచులను ప్రభుత్వమే రవాణా చేస్తుందని, రైతులందరు ప్రభుత్వం వారు నిర్దేశించిన ప్రామాణికాల ప్రకారం ధాన్యం అమ్ముకోవాల న్నారు. ఈ సమావేశంలో అగ్రికల్చరల్ ఆఫీసర్, కె.వి.యన్.పోసరావు, అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి

విశాలాంధ్ర- ఉండి : ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరు శ్రద్ధ చూపాలని, చెడు అలవాట్లకు వ్యసనా లకు దూరంగా ఉండాలని డాక్టర్ సునంద పిలుపు నిచ్చారు. మండల పరిధిలోని పాముల పర్రు పంచాయతీ కార్యాలయం వద్ద విలేజ్ క్లినిక్ గ్రామ సర్పంచ్ కేసన శాంతి కుమారి బలుసులరావు ఆధ్వర్యంలో గురువారం జరిగింది. గ్రామంలో కీళ్ల నొప్పులు, మోకాళ్ళ నొప్పులు, శరీరం

నొప్పులు, ఊబకాయం, షుగరు, బిపి, జ్వరము, తలనొప్పి, వంటి వివిధ రుగ్మతలతో బాధపడుతున్న గ్రామస్తులకు పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సునంద మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు. ఒంటి శుభ్రత ఇంటి శుభ్రత పాటించాలన్నారు. వ్యాధుల పట్ల అశ్రద్ధగా ఉండకుండా డాక్టర్లు సూచనలు, సలహాలు తీసుకొని వారిచ్చిన మందులను క్రమం తప్పకుండా వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సి.హెచ్.ఓ. తనూజ, ఏ.ఎన్.ఎం. జయమణి ,ఆశ కార్యకర్తలు డి. ఏసు మని, బి.ఆదిలక్ష్మి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేస్తాం

(1వ పేజీ తరువాయి)

పెసలను కొనుగోలు చేసినట్టు తెలిపారు. తద్వారా సేకరించిన పెసల విలువ రూ. 18,19,70,379లుగా తెలియజేశారు. రైతులు ధాన్యం కొనుగోలుకు సంబంధించిన మరింత సమాచారం/ ఫిర్యాదుల నిమిత్తం జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్ నెం.08812-230448, 7702003584, 7569562076, 7569597910 లను సంప్రదించవచ్చునని తెలిపారు.

తీరనున్న ప్రజల త్రాగునీటి కష్టాలు

- ఆర్ఎంసి నుంచి గోదావరి జలాల తరలింపుపై డిపిఆర్ సిద్ధం
- అధికారులతో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

విశాలాంధ్ర-పెదవేగి: దెందులూరు నియోజకవర్గ పరిధిలోని దెందులూరు, పెదవేగి, పెదపాడు, ఏలూరు రూరల్ మండలాల పరిధిలోని పలు గ్రామాల ప్రజల త్రాగునీటి కష్టాలను తీర్చడానికి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తీసుకుంటున్న ప్రత్యేక చొరవతో ప్రజల త్రాగునీటి కష్టాలు తీరబోతున్నాయి.కృష్ణ కెనాల్‌కు టెయిల్ ఎండ్‌లో ఉన్న దెందులూరు నియోజకవర్గ పరిధిలోని అనేక గ్రామాల ప్రజలు ఎంతో అపరిశుభ్రంగా ఉన్న కృష్ణ కెనాల్ నీటినే త్రాగునీరుగా తాగవలసిన దుస్థితి ఉండడంతో నియోజకవర్గ పరిధిలోని ప్రజలకు సురక్షితమైన గోదావరి త్రాగునీటి జలాలను అందిస్తామని ఎన్నికల ప్రచారవేళ దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ నియోజకవర్గ ప్రజలకు భరోసా ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఇటీవల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని గోదావరి సమావేశ మందిరంలో జరిగిన జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో సైతం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ నియోజకవర్గంలోని 4 మండలాల ప్రజలు ఎదుర్కొంటున్న త్రాగునీటి కష్టాలను సత్వరమే పరిష్కరించేలాగా, వారికి కొప్పాక వద్ద నుంచి పోలవరం రైట్ మెన్ కెనాల్ ద్వారా గోదావరి జలాలను తరలించి సురక్షితమైన త్రాగునీరు అందించేలాగా అధికారులు చర్యలు చేపట్టాలని సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా గోదావరి జలాల తరలింపుపై ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రీ సెల్వి సమావేశంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు తెలియజేశారు. ఈ నేపథ్యంలో గురువారం పెదవేగి మండలం కొప్పాక వద్ద పోలవరం కుడి కాలువ నుంచి గోదావరి జలా లను కొప్పాక చెరువులో స్టోరేజ్ చేసి, రాపిడ్ సాండ్ ఫిల్టర్ విధానం ద్వారా వాటికి శుభ్రపరిచి తద్వారా ఆ నీటిని ఓహెచ్చిఆర్ విధానం ద్వారా దెందులూరు నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాలలో గల గ్రామాల ప్రజలకు అందిస్తూ వారి త్రాగునీటి కష్టాలను తీర్చడానికి రూపొందించబడిన డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డిపిఆర్) ను దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గ్రామీణ నీటి సరఫరా అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ నీటి సరఫరా శాఖ పర్యవేక్షక ఇంజనీర్ త్రినాథ్ బాబు,డి.ఈ రామారావు, ఏఈలు వర్మ, శ్రీకాంత్, శ్రీనివాస్,సహా పలువురు కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఎండగట్టాలి

(1వ పేజీ తరువాయి)

వ్యతిరేక పాలకులపై మరో స్వాతంత్ర్య పోరాటం చేయాలని ఈ దిశగా పార్టీ శ్రేణులు ప్రజలను కార్యోన్ముఖులను చేయాలని కోనాల సూచించారు.

శాఖ నూతన కమిటీ: అనంతరం సీపీఐ మున్సిపల్ శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా నీలాపు శ్రీను, కార్యవర్గ సభ్యులుగా రెల్ల రాము, ధనాల విశ్వనాధ్, మాదుగుల రవికుమార్, ఆర్.పీరుబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలో ఆస్తి పన్నులు తగ్గించాలని, అర్హులందరికీ రేషన్ కార్డులు, సామాజిక పింఛన్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, అన్ని నిత్యావర సరుకులను రేషన్ దుకాణాల్లో పంపిణీ చేయాలని శాఖ మహాసభలో తీర్మానించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్,సికిలే పుష్పకుమారి, యూనియన్ నాయకులు చిత్తరంజన్ తదితరులు పాల్గొన్నారు.

తగ్గించాలి

(1వ పేజీ తరువాయి)

తల్లొగ్గి విలువ ఆధారిత పన్ను విధానాన్ని ప్రవేశపెట్టి జీవో నెంబర్ 198 విడుదల చేసింది అన్నారు. పట్టణాలలో మౌలిక సౌకర్యాలపై దృష్టి పెట్టకుండా ఆస్తి పన్నులు పెంచడం తగదన్నారు. పెంచిన పన్నులు వెంటనే తగ్గించాలని లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఐక్యంగా ప్రతిఘటించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు, నాయకులు పల్లె ప్రేమ్ కుమార్, పి. ప్రవీణ్, ఒగ్గు ముఖర్జీ, రంగా తదితరులు పాల్గొన్నారు

ఉపసంహరించాలి

(1వ పేజీ తరువాయి)

పాపారావు ఇంటి మీదుగా మదర్ థెరిసా బొమ్మ వద్దకు చేరుకుని అక్కడ గంట సేపు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు మాట్లాడుతూ అటు మోడీ, ఇటు కూటమి ప్రభుత్వాల దెబ్బకు ప్రజల జీవన విధానం కుదేలైందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు ఉచిత గ్యాస్ అనే పేరుతో ఆర్భాట ప్రచారాలు నిర్వహించి ఎన్నికల్లో నెగ్గిన తర్వాత శ్రీరామనవమి సందర్భంగా వంట గ్యాస్ పై 50 రూపాయలు పెంచి ప్రజలపై అధిక భారాలు మోపుతారా అని ప్రశ్నించారు. ఇప్పటికే ఈ 10 నెలల కాలంలో విద్యుత్ చార్జీలు, మందుల ధరలు, పెట్రోల్ డీజిల్ ధరలు ఆస్తి పన్ను పెంపు, నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచారని అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి, సహాయ కార్యదర్శి కే బోడకొండ, తోకల ప్రసాద్ మాట్లాడుతూ గ్యాస్ బండ పెంపుతో పాటు పట్టణాల్లో పెంచిన ఆస్తి పన్నులతో ప్రజలు సతమతమవుతున్నారని అన్నారు. ఆస్తి విలువ ఆధారిత ఇంటి పన్ను విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కన్వీనర్ ఏ. భవాని, సిపిఐ నాయకులు పప్పు ఆదినారాయణ, కేశవరపు అప్పలరాజు, అన్నవరం, ఏఐఎస్ఎఫ్ నాయకులు సురేంద్ర, ఏఐటీయూసీ నాయకులు రామయ్య, అనిల్, మహిళా సమాఖ్య నాయకురాలు కుమారి, గంగా, అప్పయ్యమ్మ, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

హోమియో వైద్య సేవల్ని ప్రజలకు చేరువ చేయాలి : ఎమ్మెల్యే బడేటి

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : హోమియో వైద్య సేవల్ని ప్రజలు మరింత చేరువచేసి సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ఆకాంక్షించారు. ఏలూరు ఆర్ఆర్ పేటలోని పార్క్ వద్ద గురువారం నిర్వహించిన హోమియో వైద్య

సృష్టికర్త డాక్టర్ సిఎఫ్ శామ్యూల్ హానిమన్ 207వ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతిక్ ఫిజిషియన్స్ సంస్థ జాతీయ అధ్యక్షులు డాక్టర్ కెఎస్ఎస్.శివమూర్తి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చంటికి ఘన స్వాగతం పలికారు. అనంతరం డాక్టర్ హానిమన్ కాంస్య విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ హోమియో వైద్య సేవల్ని ప్రజల చెంతకు చేర్చేందుకు సంస్థ చేస్తోన్న కృషిని ప్రశంసించారు. రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎఎంసి ఛైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారధి, డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, 33వ డివిజన్ టిడిపి ఇన్‌ఛార్జ్ పి.సంధ్యా శ్రీలక్ష్మి, టిడిపి నాయకులు ఆరెపల్లి తిరుపతిరావు, ఐఐహెచ్‌పి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వికె. పంకజాక్షన్, జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఆర్‌పి భాస్కరాచార్యులు, డాక్టర్ కూరపాటి శ్రీనివాస్, డాక్టర్ రామచంద్రరావు, డాక్టర్ గోపీనాథ్, డాక్టర్ అబ్బూరి అరుణ, డాక్టర్ బందారు సుదీప్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవల్ని మరింత విస్తృతం చేసేందుకు దాతలు ముందుకు రావాలి : ఎమ్మెల్యే చంటి

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : ప్రజా సేవల్ని మరింత విస్తృతం చేసేందుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకురావాలని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పిలుపునిచ్చారు. ఆ సేవలు ఎందరికో ఉపయుక్తంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఏలూరు లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ప్రజా వినతులందించేందుకు

వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరించి వారి సమస్యలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. కో - ఆప్షన్ సభ్యురాలు నీతాజైన్ సమకూర్చిన కుట్టు మిషన్‌ను 11వ డివిజన్‌కు చెందిన లక్ష్మి అనే మహిళకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏలూరు నియోజకవర్గంలో ప్రజా క్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సరికొత్త మార్పులకు అంకురార్పణ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎఎంసి ఛైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారధి, డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, కో - ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, టిడిపి నాయకులు బెల్లపుకొండ కిషోర్, ఆర్నేపల్లి తిరుపతి, చిరంజీవి, త్రిపర్ణ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - ముదినేపల్లి : అంగన్వాడి కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు అన్నారు. మండలంలోని చేవూరుపాలెంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో

పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ దాసి సుందరమ్మ మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు , 2 ఏళ్లలోపు పిల్లలు వారి తల్లిదండ్రులు పౌష్టికాహార ప్రాముఖ్యతలు తెలుసుకోవాలన్నారు. చిరుధాన్యాలు, ఆకుకూరలు, పండ్లు తీసుకోవడంతో రక్తహీనత అధిగమించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు ఎం. భాగ్యలక్ష్మి, టి. భాగ్యలక్ష్మి, పి. భవాని, చిన్నారులు, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి పరుచుకోవాలి : ఎమ్మెల్యే కామినేని

విశాలాంధ్ర - కలిదిండి: ప్రజా ప్రతినిధులు పార్టీలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి పరచుకోవాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. గురు వారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్మాణాలలో క్వాలిటీ విషయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు అలసత్వం వహించ వద్దని తెలిపారు. సొంత భవనాల నిర్మాణాలు చేపట్టినప్పుడు ఎక్కువ కాలం మన్నేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారని, అదే ప్రభుత్వ భవనాలు కానీ మరి ఏ ఇతర నిర్మాణాల విషయంలో అలసత్వం వహిస్తున్నారని కట్టిన 10, 15 ఏళ్లకే పెచ్చులూడి పడిపోతున్నాయని పేర్కొన్నారు. అధికారులు, కాంట్రాక్టర్లు క్వాలిటీ విషయంలో రాజీ పడకుండా నిర్మాణాలు చేపట్టాలని తెలిపారు. 5 ఏళ్లలో ఆర్ అండ్ బి రోడ్లు నిర్మాణం, గ్రామాలలో సిసి రోడ్ల నిర్మాణం పూర్తి చేయడానికి తనవంతు సహకారాన్ని అందిస్తానన్నారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వర రావు మాట్లాడుతూ మండల కేంద్రమైన కలిదిండిలో కొన్ని ప్రభుత్వ కార్యాలయాలలో అధికారులు లేరని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీలకు వచ్చిన నిధులు పార్టీలకు అతీతంగా న్యాయబద్ధంగా ఉన్న వాటిని పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. తొలుత ఎంపీడీవో కార్యాలయం వద్ద నాయకులతో కలిసి ఏలూరు పార్లమెంటు సభ్యులు ఎంపీ పుట్ట మహేష్ కుమార్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బొర్రా సత్యవతి, వైస్ ఎంపీపీ కనకదుర్గారాణి, నాగలక్ష్మి, ఇన్చార్జి ఎంపీడీవో వి. కొండలరావు, వివిధ శాఖల అధికారులు, ఎంపీ టీసీలు, సర్పంచులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు అభినందనీయం

కలెక్టర్ నాగరాణి

విశాలాంధ్ర- పాలకోడేరు : ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. అంతర్జాతీయ సహకార సంఘాల సంవత్సరం సందర్భంగా గురు వారం పాలకోడేరు విశాల సహకార సంఘం ఆధ్వర్యంలో మదర్ నెస్ హాస్పిటల్, భీమవరం సహకారంతో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ శిబిరానికి వచ్చే వారందరికీ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు సరఫరా చేస్తారని అందువల్ల ప్రతి ఒక్కరు వైద్య శిబిరాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. జిల్లా సహకార సంఘం అధికారి నాగరాజు మాట్లాడుతూ ఈ ఉచిత వైద్య శిబిరంలో ప్రత్యేకంగా మహిళలకు పిల్లలకు సంబంధించిన ఆరోగ్య పరీక్షలు, మరియు చికిత్సలకు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సుమారు 80 మంది వినియోగించుకున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు ఈ కార్యక్రమంలో డాక్టర్ మాధురి, మండల తహసిల్దార్ ఎన్. భారతి విజయలక్ష్మి, ఈఓపిఅండ్ఆర్డి రాంప్రసాద్, డిఆర్ కె.వెంకటేశ్వరరావు, పిఎసి కొండా ఫణి కుమార్, సీఈవో పి ఎల్ నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ మహేష్‌కు అమిత్‌షా శుభాకాంక్షలు

విశాలాంధ్ర -ఏలూరు : ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కు కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ మంత్రి అమిత్ షా గురువారం పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంపీ మహేష్ కుమార్ కు కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా స్వయంగా ఫోన్ చేసి పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షాకు ఎంపీ మహేష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

డ్రైన్లను ప్రక్షాళన చేయాలి-సీపీఐ

విశాలాంధ్ర -భీమవరం: పట్టణంలోని డ్రైన్లన్నింటినీ ప్రక్షాళన చేయాలని, రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని శివారు ప్రాంతాలకు కూడా త్రాగునీరు కుళాయిల ద్వారా అందేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు డిమాండ్ చేశారు. పట్టణంలోని డ్రైనేజీలు, త్రాగునీటి వ్యవస్థలను ప్రక్షాళించాలని డిమాండ్ చేస్తూ పట్టణ సిపిఐ ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా చెల్లబోయిన మాట్లాడుతూ పట్టణంలోని డ్రైనేజీ వ్యవస్థను బాగు చేసి ఐదారేళ్లు దాటిందన్నారు. గతంలో ప్రతి వేసవిలో మేజర్, మీడియం, పిల్ల డ్రైన్లతో సహా సిల్టు తీసే వారని, ఇప్పుడు సోమగుండం డ్రైన్, ఓల్డ్ యనమదుర్రు డ్రైన్ తో సహా పలు మేజర్ మీడియం డ్రైనేజీలు నిలువెత్తు సిల్ట్, చెత్తా చెదారం పేరుకుపోయిందని , పిల్ల డ్రైన్లు పూడిపోయాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గత కొన్నేళ్లుగా కొద్దిపాటి వర్షానికే పట్టణం నడుం నీటిలో మునిగి తేలుతుందని, ముంపు తీయడానికి పది పన్నెండు గంటల సమయం పడుతుందని ఆయన గుర్తు చేశారు. రానున్న వేసవి దృష్ట్యా త్రాగు నీటి సరఫరా పై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని, శివారు ప్రాంతాలకు కూడా త్రాగునీరు కుళాయిలు ద్వారా అందించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పి.యాకోబు, ముత్యాలు, రాంబాబు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోగుల పట్ల వైద్యులు గౌరవంగా మెలగాలి

విశాలాంధ్ర- తాడేపల్లిగూడెం: రోగుల పట్ల వైద్యులు గౌరవంగా మెలగాలని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఏరియా ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఆపరేషన్ థియేటర్లో నూతనంగా ఏర్పాటు చేసిన టేబుళ్లను పరిశీలించారు. డిజిటల్ ఎక్స్ రే యూనిట్లో నూతనంగా ఏర్పాటు చేసిన రెండు ఫిజి క్యాబినెట్‌లను ప్రారంభించారు. పోస్టుమార్టం షెడ్‌లో సదుపాయాలను పరిశీలిం చారు. డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు కావలసిన స్థలాన్ని పరిశీలించారు. ఏరియా ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ ఏవి ఆర్ ఎస్ తాతారావు ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన సౌకర్యాలను శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్‌కు చూపించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.ప్రైవేట్ ఆస్పత్రులకు దీటుగా ఏరియా ఆసుపత్రిలో సేవలందించాలని డాక్టర్లకు సూచించారు. జిల్లాలో ప్రథమ స్థానంలో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి ఉండేలా కృషి చేయాలి అన్నారు. ఆసుపత్రిలో అన్ని సదుపాయాలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. దాతల సహకారంతో మరిన్ని సౌకర్యాలు అందిస్తామన్నారు. రోగులకు అంది స్తున్న మందులు సక్రమంగా పనిచేస్తున్నాయో ,లేదో రోగుల నుండి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని డాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వర్తనపల్లి కాశి, అడబాల నారాయణమూర్తి, పైబోయిన వెంకటరామయ్య, ఎన్వి సత్యనారాయణ ,ఫుల్లా బాబి తదితరులు పాల్గొన్నారు.

నేతన్నలను ఆదుకోవాలి

చేతివృత్తిదారుల సమాఖ్య

విశాలాంధ్ర -భీమవరం : నేతన్నలను కాపాడాలంటే మగ్గాలపై నేసిన నేత వస్త్రాలను కొనుగోలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని చేతివృత్తుదారుల సమాఖ్య జిల్లా నాయకులు ఎం.సీతారాం ప్రసాద్ అన్నారు. గురువారం చేనేత కార్మిక సంఘం 89వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యాలయం వద్ద చేనేత కార్మిక జెండాను చేతివృత్తిదారుల సమాఖ్య నాయకులు కె.ఎన్.వి.బ్రహ్మం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీతారాం ప్రసాద్ మాట్లాడుతూ 89 సంవత్సరాల క్రితం తూర్పు గోదావరి జిల్లా ఉప్పాడ గ్రామంలో ఆవిర్భవించిన చేనేత కార్మిక సంఘం నాటి నుండి నేటి వరకు ఎన్నో ఉద్యమాలను నడిపిందన్నారు. చేనేత కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం ఎనలేని త్యాగాలు చేసిందని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ఎంతో కృషి చేసిందన్నారు. సామాజిక కార్యకర్త చాంద్‌బాషా మాట్లాడుతూ మెట్ల వీరయ్య, ఉత్సవ సత్యనారాయణ, కడుపు రాములు వంటి మహోన్నతులు ఈ సంఘాన్ని ఏర్పాటు చేసి తీర్చిదిద్దారని ఇటువంటి సంఘాన్ని నిరంతరం కాపాడు కోవాల్సిన బాధ్యత ప్రభుత్వం పైన ప్రజల పైన ఉందన్నారు. కార్యక్రమంలో చేతివృత్తులదారుల సంఘం రాష్ట్ర నాయకులు మల్లుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మించండి-సీపీఐ

విశాలాంధ్ర -నరసాపురం: నర్సాపురం 7వ వార్డు శివాలయం వీధిలో ఫణి మెస్ వద్ద నుండి టిడిపి కార్యాలయం వరకు డ్రైనేజీ పూర్తి గా పాడై పోయిందని, వెంటనే కొత్త డ్రైనేజీ నిర్మించాలని సిపిఐ నర్సాపురం ఏరియా కార్యదర్శి నెక్కంటి క్రాంతి కుమార్ విజ్ఞప్తి చేశారు. గురువారం డ్రైనేజీ నిర్మించాలని సిపిఐ నాయకులు నర్సాపురం ఆర్డీఓ దాసి రాజుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శివాలయం వీధిలో డ్రైన్ పగిలి రోడ్ల మీదకు మురికి నీరు వచ్చి దుర్వాసన వస్తుందని వెంటనే డ్రైన్ నిర్మించాలని కోరారు. అలాగే పట్టణంలో శిథిలావస్థలో ఉన్న డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఆరేటి మృత్యుంజయరావు, నాగళ్ళ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

కష్టాల అనుభవాల నుంచి ఉన్నత స్థాయికి...

విశాలాంధ్ర-లింగపాలెం: కష్టాల అనుభవాలను పాఠాలుగా మలుచుకొని ఉన్నత స్థాయికి అనేకమంది ఎదుగుతుంటారు. ఇటువంటి వారి జీవితం సమాజానికి ఆదర్శనీయం. గ్రామీణ ప్రాంతంలోని వ్యవసాయ కుటుంబంలో పుట్టి కష్టాలను ఎదుర్కొని ఉన్నత స్థాయికి ఎదిగిన వారిలో ఒక్కొక్కరిది ఒక్కొక్క అనుభవం. ఇటువంటి వారిలో ఉన్నత స్థాయికి ఎదిగిన ఇరువురి అనుభవాలను విశాలాంధ్ర వెలుగులోకి తెచ్చింది. వివరాల్లోకి వెళితే...

అవమానాలను పాఠంగా నేర్చుకొన్నాను

యనమదుల. యుగంధర్,

గౌర్మే పాప్ కార్నికా కంపెనీ సిఈఓ

ఉద్యోగం కోసం అవమానాలు ఎదుర్కొన్నాను. ఎమ్మెస్సీ కంప్యూటర్ చేశాను. ఉన్నత సామాజిక వర్గానికి చెందిన నేను ఒక కంపెనీలో మంచి స్థాయి అధికారిగా ఎంపిక అయ్యాను. మరొక సామాజిక వర్గానికి చెందిన కంపెనీలో కుల వివక్షత ఎదురవటంతో వచ్చిన ఉద్యోగాన్ని కోల్పోయాను. నా జీవితంలో అదొక పీడకల.దీన్ని పట్టుదలగా తీసుకున్నాను.కాట్రేనిపాడుకు చెందిన నేను వచ్చిన ఉద్యోగం కుల వివక్షత వల్ల కోల్పోయి కంప్యూటర్ కంపెనీ స్థాపించా. ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయా. ఇటువంటి సమయాలలో ఒక సీడ్ కంపెనీలో ఉద్యోగిగా చేరాను. నాపనితీరు, క్రమశిక్షణ,నిబద్ధత, ఆకట్టుకోవడంతో గౌర్మే పాప్కార్నికా కంపెనీ యాజమాన్యం సిఈఓ గా నియమించింది. ఈపదవిలో ఉన్న తాను కంపెనీని, కంపెనీ సేవలను వివిధ రాష్ట్రాల్లో విస్తరించాను. 600 మందికి పైగా ప్రతిభ ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించా.సిఈఓగా దాదాపు16వేల మంది రైతులకు అండగా ఉంటున్నాను.

ప్రతిభకు గుర్తింపు ఉంటుంది

చిలుకూరి మోహన్ రెడ్డి.

హెటిరో డ్రగ్స్ లిమిటెడ్ డైరెక్టర్

చదువుకోటానికి ఎన్నో ఇబ్బందులు పడ్డాను. నాన్నకు వ్యవసాయ భూములు సమృద్ధిగా ఉన్నా నీరు లేక పంటలు పండేవి కాదు. తనది వ్యవసాయ కుటుంబమైనా వ్యవసాయంలో వస్తున్న కష్టాలను చూసి అమ్మ,నాన్నలు నన్ను బాగా చదివించి పెద్ద ఉద్యోగిగా చూడాలని ఆశపడేవారు. బి ఫార్మసీ,ఎంఫార్మసీ చదివించేందుకు మా నాన్న చాలా కష్టాలు పడ్డారు.ఎంఫార్మసీ పూర్తి చేశాక మొదట ప్రైవేట్ కంపెనీలో నెలకు రూ.650లు ఉద్యోగిగా చేరాను. ఆర్థిక ఇబ్బందులు ఎన్నో ఎదుర్కొన్నాను. ఆ తరువాత హెటిరో కంపెనీలో ఉద్యోగిగా చేరాను.

చదువుకునే వారికి కష్టాలు ఉండకూడదని, చదువుకునే వారందరికీ ఉద్యోగం ఉండాలని కోరుకునే వాడిని. తనకు కంపెనీలో ఉద్యోగం రావడంతో కంపెనీ విశ్వసనీయతను పొందాను. అంతర్జాతీయంగా దాదాపు 40దేశాలలో విస్తరించిన ఈ కంపెనీకి నేను ఒక డైరెక్టర్ను అయ్యాను. ఈ స్థాయికి రావడానికి ఎంతో శ్రమించాను.కంపెనీలో ఉన్న9మంది డైరెక్టర్లలో నేను ఒకడిని కావటం నా కష్టానికి ఫలితంగా భావించాను. ఆర్థికంగా స్థిరపడ్డా. నా గ్రామమైన ప్రగడవరాన్ని అభివృద్ధి చేసేందుకు, చదువుకునే పేదలను ఆదుకునేందుకు తన వంతు సహాయం అందిస్తున్నాను.

ఘనంగా చేనేత వ్యవస్థాపక దినోత్సవం

విశాలాంధ్ర-ఏలూరు: చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికై నిరంతరం పోరాడుతున్న ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం (ఏఐటి యుసి) 90వ వ్యవస్థాపకో త్సవాన్ని ఏలూరులో ఘనంగా జరిపినట్లు చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కడుపు కన్నయ్య తెలిపారు.

ఏపీ చేనేత కార్మిక సంఘం 90వ వ్యవస్థాపక దినోత్సవాన్ని స్థానిక 36వ డివిజన్ భగత్ సింగ్ సెంటర్లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కడుపు కన్నయ్య మాట్లాడుతూ నేతన్న నేస్తం పథకాన్ని సొంతమగ్గం ఉన్నవారితో పాటు చేనేత పని చేస్తున్న ప్రతి ఒక్క నేత కార్మికునికి అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ఏపీ చేనేత కార్మిక సంఘం నిర్వహిస్తున్న కార్యక్రమాలలో చేనేత కార్మికులు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో చేనేత కార్మికులు బి సత్యనారాయణ, ఎన్. శేఖర్, ఎం. అమ్మాజీ, కే. రంగనాయకమ్మ, సూర్యకాంతం, పాపాయమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

విశాలాంధ్ర- ఉండి : గర్భిణీలు, బాలింతలకు, రెండు సంవత్సరాల లోపు పిల్లలకు పౌష్టిక ఆహారంతోనే ఆరోగ్యంగా ఉంటారని సిడిపిఓ వాణి విజయరత్నం అన్నారు. ఆకివీడు ప్రాజెక్టు పరిధి లోని ఉండి మండలం కోలమూరు అంగన్వాడి కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమం అంగన్వాడి సూపర్వైజర్ పి. మేరీ అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వాణి విజయరత్నం హాజరై

మాట్లాడారు. గర్భిణీలు, బాలింతలు, రెండు సంవత్సరాల్లోపు పిల్లలు తీసుకోవలసిన ఆహారం గురించి వివరించారు. ఆకుకూరలు, చిరుధాన్యాలు, పప్పు దినుసులతో కూడిన పౌష్టికాహారంతో పాటు పండ్లను తరుచుగా తీసుకోవాలన్నారు. గర్భిణీలు బాలింతలు కిశోర్ బాలికలు బలమైన ఆహారం తీసుకోకపోతే జరిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్. వి. వి. లక్ష్మి, టి. పెద్ద బేబీ, కే. సుబ్బలక్ష్మి, పి .అరుణకుమారి, ఎం. నాగమణి, పి. వెంకమ్మ, గర్భిణీలు, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ధాన్యం కొనుగోలు కేంద్రాలు

విశాలాంధ్ర-టి నరసాపురం: ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం ధాన్యం కొనుగోలు ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ టి. సాయి బాబా తెలిపారు. స్థానిక రైతు సేవా కేంద్రం ద్వారా రబీ సీజన్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారుల నుండి మోసపోకుండా ప్రభుత్వం మద్దతు ధర కల్పించి ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ప్రతి రైతు ఈ పంట నమోదు చేయించుకోవాలన్నారు. అనంతరం వ్యవసాయ పరికరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జి.మణి కుమారి, వ్యవసాయ

అధికారిణి బి. సుమలత, విద్యాశాఖాధికారిణి ఎస్. కళ్యాణి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జయ్యవరపు శ్రీ రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఉచిత కుట్టుశిక్షణను సద్వినియోగం చేసుకోండి : ఎమ్మెల్యే ధర్మరాజు

విశాలాంధ్ర - ఉంగుటూరు : ఏపీ రాష్ట్ర ప్రభుత్వం మహిళా అభ్యున్నతికి ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణ తరగతులను మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు అన్నారు. గురువారం ఉంగుటూరు పాత సచివాలయం -2 వద్ద ఉచిత కుట్టు (టైలరింగ్) శిక్షణ

కేంద్రాన్ని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శిక్షణ అయిన తర్వాత ఉచితంగా కుట్టు మిషన్ ఇస్తారన్నారు. ఈ శిక్షణ ద్వారా మహిళలు నైపుణ్యం పొంది ఎవరిపై ఆధారపడకుండా స్వశక్తిపై జీవించవచ్చునన్నారు. ఉంగుటూరు నియోజక వర్గంలో 393 మందికి శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం గుర్తించిన ఇసుక రీచ్‌లను ప్రారంభించాలి

- భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి
- ఏఐటీయూసీ డిమాండ్

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు జిల్లాలో లక్షలాదిమంది భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పనకు దోహదపడేలా జిల్లాలో ప్రభుత్వం గుర్తించిన, అనుమతించిన ఇసుక రీచ్‌లను తక్షణమే ప్రారంభించాలని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్‌డాంగే, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు పల్లెం కిషోర్ డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రభుత్వం గుర్తించిన ఇసుక రీచ్‌లను ప్రారంభించాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర రావుకు ఏఐటీయూసీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఏలూరు జిల్లాకు చుట్టుపక్కల జిల్లాలైన కృష్ణ,తూర్పుగోదావరి జిల్లాలలో ప్రభుత్వం ప్రకటించిన ధరకే ఇసుక రీచ్ లను ప్రారంభించి ఇసుకను అమ్ముతున్నారని వారు తెలిపారు. ఏలూరు జిల్లాలో ఇసుక రీచ్ లను ప్రారంభించకపోవడంతో తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల నుంచి గృహ వినియోగదారులు బ్లాక్ లో ఇసుక కొనుగోలు చేసి నిర్మాణాలు చేపడుతున్నారని ఆ విధంగా ఇసుకను బ్లాక్‌లో కొనడం వల్ల వినియోగదారులకు అధిక భారం అవుతుందని తెలిపారు. ఇసుక కొరత వల్ల భవన నిర్మాణ కార్మికులకు కూడా ఉపాధి తగ్గుతుందని నాయకులు డాంగే, వెంకటేశ్వర రావు, కిషోర్ పేర్కొన్నారు. భవన నిర్మాణ రంగంలో సుమారు 18 రకాల పనులు చేసే కార్మికుల ఉపాధికి ఇసుక దొరకక పోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వారు తెలిపారు. జిల్లాలో ఇసుక రీచ్ లను ప్రభుత్వం ప్రకటించిన ధరలకే వెంటనే ప్రారంభించాలని వారు కోరారు.భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, కార్మికుల పెండింగ్ క్లైములను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.జిల్లా రెవెన్యూ అధికారి ఏఐటియుసి నాయకులతో మాట్లాడుతూ జిల్లాలో ఇసుక రీచ్ లను త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు పుప్పాల కన్నబాబు,ఏ అప్పలరాజు, కడుపు కన్నయ్య, బుగత జగన్నాధ రావు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు బోడెం వెంకట్రావు,ఎం. ఇమ్మానియేల్, బుగ్గల ప్రభాకర్, అరిగెల యోహాన్,బళ్ళ కనక దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై పోరాటాలు చేయాలి - సీపీఐ

విశాలాంధ్ర - వేలేరుపాడు : స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం అయ్యేవరకు కార్యకర్తలు పోరాటాలు చేయాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండి మునీర్ పిలుపునిచ్చారు. వేలేరుపాడు సీపీఐ కార్యాలయంలో గురువారం మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో మంచి నీటి ఎద్దడి ఏర్పడిందన్నారు. రహదారుల సౌకర్యం సరిగా లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రన్నారు. పోలవరం ముంపు సాకుతో ప్రభుత్వం ఏడు పంచాయతీ లలో అభివృద్ధి కార్యక్రమాలు నిలిపివేయటం వలన ప్రజల ఇబ్బందులు వర్ణనాతీతం అన్నారు. గోదావరి వరదల సమయం ఆసన్నమవుతుందని వెంటనే ముంపు గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లోని సమస్యలపై ప్రతి కార్యకర్త ప్రభుత్వ అధికారులకు తెలియజేసి అవి పరిష్కారం అయ్యేవరకు నిర్విరామంగా పనిచేయాలన్నారు.

మండల మహాసభ జయప్రదం చేయండి

ఈ నెల 30న మల్లారం గ్రామంలో నిర్వహించే మండల మహాసభను జయప్రదం చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య, మండల కార్యదర్శి బాడిశ రాము, రామవరం సర్పంచ్ పిట్టా ప్రసాద్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యర్రా మధు, కురిమెళ్ళ వెంకటేశ్వర్లు కరటం సీతామహాలక్ష్మి బంధం అర్జున్, ముత్యాలు, ప్రసాద్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

లిబర్టీ చిల్డ్రన్స్ హోమ్‌లో ఎంపీ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-చింతలపూడి: చింతలపూడి మండలం బట్టువారి గూడెంలో లిబర్టీ చిల్డ్రన్స్ హోమ్ లో చిన్నారుల మధ్య ఎంపీ పుట్ట మహేష్ యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా స్థానిక శాసన సభ్యులు సొంగా రోషన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిం చారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రత్యేక ప్రార్థనలు చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం శాసనసభ్యులు సొంగ రోషన్ కుమార్ మాట్లాడుతూ ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ చిన్ననాటి నుంచి నాయకత్వ లక్షణాలు కలిగి ఉన్నారని అన్నారు. అనంతరం స్థానిక పట్టణ, మండల కూటమి నాయకులతో కలిసి భోజనాలు ఏర్పాటు చేసి శాసనసభ్యులు విద్యార్థులకు స్వయంగా వడ్డించారు. అంతకు ముందు చింతలపూడి పట్టణంలో స్థానిక శాసనసభ్యులు క్యాంపు కార్యాలయంలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో కేకు కట్ చేసి ఎంపీ పుట్ట మహేష్ యాదవ్ కు శాసనసభ్యులు సొంగ రోషన్ కుమార్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో చింతలపూడి నియోజక వర్గ మాజీ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డి, తెలుగుదేశం చింతలపూడి మండల అధ్యక్షులు మాటూరి వెంకట రామయ్య తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ఎంపీ పుట్టా మహేష్ జన్మదిన వేడుకలు

టీడీపీ శ్రేణుల ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు

విశాలాంధ్ర -ఏలూరు : ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పుట్టినరోజు వేడుకలు టీడిపి శ్రేణుల ఆధ్వర్యంలో గురువారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఇన్ పేషెంట్ వార్డుల్లో చికిత్స

పొందుతున్న రోగులు, బాలింతలు, గర్భిణులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. శాంతినగర్ లోని ఎంపీ మహేష్ కుమార్ క్యాంపు కార్యాలయంలో కూటమి నాయకులు కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. టిడిపి ప్రొఫెషనల్ వింగ్ ఏలూరు పార్లమెంట్ అధ్యక్షుడు ఆరేపల్లి శివ ఆధ్వర్యంలో వాసన్ ఐ కేర్ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి సంబంధిత వ్యాధులతో బాధపడుతూ శిబిరానికి తరలివచ్చిన వారికి నేత్ర వైద్య నిపుణులు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం మాదేపల్లిలోని ప్రేమాలయంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. కూటమి నాయకులు షేక్ కరీముల్లా, నందిగం రవిచంద్ర ఆధ్వర్యంలో కోటదిబ్బలో గల మూగ, చెవిటి ఆశ్రమంలో దివ్యాంగులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెద్దిబోయిన శివప్రసాద్, పూజారి నిరంజన్, రెడ్డి నాగరాజు, ఎంపీ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు పూర్వవైభవం ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర -వీరవాసరం: గ్రామాలకు పూర్వ వైభవం తీసుకురావాలనే ఆలోచనలో కూటమి ప్రభుత్వం 9 నెలల్లోనే ఎన్నో అభివృద్ధి పనులను చేపట్టిందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు అన్నారు. మండలం మత్స్యపురిలో రూ.37 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధే లక్ష్యంగా అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రారంభోత్సవాలను చేసుకుంటున్నామన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో గ్రామ టిడిపి అధ్యక్షుడు చింతా కనకయ్య, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - గణపవరం: రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందినట్లు గణపవరం ఎస్ఐ ఎ. మణికుమార్ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం టిప్పర్ (లారీ) ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం జల్లి కొమ్మర గ్రామంలో చోటు చేసుకుంది. జల్లికొమ్మర గ్రామం ఆంజనేయస్వామి విగ్రహం వద్ద రాజమండ్రి రూరల్ మండలం చెందిన గ్లామర్ మోటార్ సైకిల్‌పై వస్తున్న కట్టా సుబ్రహ్మణ్యం(37) ను టిప్పర్ ఢీకొనగా అక్కడికక్కడే రోడ్డుపై పడిపోయి మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

విశాలాంధ్ర - సీతానగరం: త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి, ఏ పి డి రామ్ ప్రసాద్ అన్నారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ ఎమ్ భారతి ఆధ్వర్యంలో ఏపిడిరామ్ ప్రసాద్ ఇళ్ళ నిర్మాణాలపై రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా చేరుకునే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం పేద వారి ఇళ్ల నిర్మాణాలపై దృఢ సంకల్పంతో ముందుకు వెళుతుంది అని అన్నారు. మీ గ్రామ పంచాయితీల పరిధిలో ఎన్‌టి ఆర్‌నగర్‌లలో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులను ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏ ఈ శ్రీ చక్రం, ఈ ఓ పి అర్డి మూర్తి, ఏ ఓ సుబ్రమణ్యం, అన్ని గ్రామాల పంచాయితీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలకు కార్యదర్శుల నియామకం

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలో కొన్ని గ్రామ పంచాయతీలకు పంచాయితీ కార్యదర్శులకు నియమిస్తూ ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే కొన్ని సర్వేలు, పెన్షన్ పంపిణీ కారణంగా నేటి వరకూ పంచాయితీ కార్యదర్శులు బాధ్యతలు తీసుకోలేదు. అయితే తాజాగా జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయితీ అధికార ఆదేశాలు రావడంతో రంపచోడవరం మండలం తామరపల్లి నుంచి సీహెచ్. ప్రభావతి బొబ్బిల్లంక, అద్దతీగల నుంచి వి. వీరేంద్ర రఘుదేవపురం, ఇందుకూరుపేట నుంచి ఎండీ రజాక్ ఉండేశ్వరపురం, అల్లూరి జిల్లా గొండోలు నుంచి టి.సూరిబాబు పురుషోత్తపట్నం, వైరామవరం నుంచి పి.లోవరాజు మిర్తిపాడు, డి. విజయదుర్గ మిర్తిపాడు నుంచి సింగవరం, ఎన్. సుధాకర్ కూనవరానికి నియమించడం జరిగింది. దీనితో మండలంలోని 21 గ్రామ పంచాయితీలకు గాను మూడు మినహా మిగిలిన అన్ని భర్తీ అయ్యాయి.

ఫ్లై ఓవర్ పనులు ప్రారంభం

విశాలాంధ్ర - ఆలమూరు : మండలంలోని జొన్నాడ గ్రామంలో 216(ఏ) నెంబర్ గల జాతీయ రహదారిపై నిలిచిపోయిన ఫ్లై ఓవర్ పనులను మొదలుపెట్టారు. ఈ ఫ్లైఓవర్ నిర్మాణం పనులతో అనేక మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇది గమనించిన సంవత్సర కాలం పాటుగా నిలిచిపోయిన పనులపై డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఇటీవల కాంట్రాక్టర్లతో కలిసి సమావేశం నిర్వహించారు. గురువారం పనులు మొదలుపెట్టడంతో స్థానికులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే రిటైనింగ్ వాల్, గడ్డర్లు సర్వీస్ రోడ్లు వంటివి త్వరలోనే పూర్తి చేస్తామని, ఫ్లై ఓవర్ సిబ్బంది తెలియజేశారు.

కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయాలి

విశాలాంధ్ర - సామర్లకోట : భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రచార జాత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా సామర్లకోట పట్టణంలో విగ్నేశ్వర థియేటర్ ఎదురుగా ఉన్న కాలనీలో సీపీఐ పట్టణ కార్యదర్శి పెద్దిరెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ ప్రచారం జత కార్యక్రమాన్ని నిర్వహించగా ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, సిపిఐ నాయకులు తోకల ప్రసాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తోకల ప్రసాద్ మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో ఈ జాతా కార్యక్రమం ప్రజా సమస్యలపై నిర్వహిస్తున్నామని, కూటమి ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని దానిలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామని, అదేవిధంగా ఉచిత గ్యాస్ అని చెప్పి 50 అదనంగా పెంచారని, అదేవిధంగా పెట్రోల్, డీజిల్ రేట్లు పెంచి సామాన్యులు నడ్డి వీరుస్తున్నారని, అందుకే ప్రజా సమస్యలపై

ఈ ప్రజా జాత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ మాట్లాడుతూ వంద సంవత్సరాల చరిత్ర జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ అనేక ప్రజా సమస్యలపై ఎప్పుడు పోరాటం చేస్తూనే ఉంటుందని అదేవిధంగా ప్రజా సమస్యలపై ఈ ప్రజా జాతా కార్యక్రమంలో పోరాటాల నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకుడు కేశవరపు అప్పలరాజు, పెదిరెడ్ల అర్జున్ రావు, మడగల రమణ, సర్ప సూరిబాబు, అడపా చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు ప్రారంభం

విశాలాంధ్ర -కొవ్వూరు : ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రూ. 20 లక్షల వ్యయంతో మారుదేవం గ్రామం సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో సీసీ రోడ్లు ప్రారంభించడం జరిగిందని కొవ్వూరు శాసనసభ్యులు వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం కుమారదేవం గ్రామం సోషల్ వెల్ఫేర్ పాఠశాలనందు సీసీ రోడ్లు జిమ్ పార్క్ , నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీసీ రోడ్ల నిర్మాణాలు వేగవంతంగా సాగుతున్నాయన్నారు. నూతన వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసిన అవంతి ఫీట్స్ అధినేత ఇంద్ర కుమార్‌కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని అర్బన్ బ్యాంక్ చైర్మన్ మద్దిపాటి శివరామకృష్ణ కొవ్వూరు నియోజకవర్గం జనసేన ఇంచార్జ్ టీవీ రామారావు దొమ్మేరు గ్రామ టిడిపి అధ్యక్షులు కలగర సుబ్బారావు సుంకర సత్తిబాబు మరియు విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌ను వినియోగించుకోండి : ఏఈ

విశాలాంధ్ర - ఆలమూరు : ప్రతి ఒక్కరూ సోలార్ విద్యుత్‌ను వినియోగించుకోవాలని ఆలమూరు విద్యుత్ శాఖ ఏఈ దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. మండలంలోని జొన్నాడ గ్రామంలో ఆయన శుక్రవారం పర్యటిస్తూ విద్యుత్ లైన్లను పరిశీలించారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాలలో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంలో భాగంగా సోలార్ రూఫ్ టాప్స్ ఏర్పాటు చేసుకున్న వారికి ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని తెలిపారు. గృహ వినియోగదారులు సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుతో విద్యుత్ బిల్లులు ఆదా చేసుకోవచ్చని తెలిపారు. అలాగే గృహ విద్యుత్ వినియోగంలో అదనపు లోడ్ను క్రమబద్ధీకరించుకోవాలని ఆయన తెలిపారు. గృహ వినియోగానికి సంబంధించి చాలా వరకు మొదట ఒక కిలో వాట్ లోడ్తోనే కనెక్షన్ తీసుకుంటారని, అయితే ఆ తర్వాత ఏసీలు, ఇతరత్రా వాటితో లోడు రెండు, మూడు కిలో వాట్స్ పెరుగుతుందన్నారు. వినియోగించిన విద్యుత్కు విద్యుత్ వినియోగదారులు చార్జీలు చెల్లిస్తున్నప్పటికీ ట్రాన్స్‌ఫార్మాలపై లోడు పెరుగుతుండటం వల్ల కాలిపోవడంలో ఓల్టేజీ, హైవోల్టేజీ సమస్యలు ఏర్పడే అవకాశం ఉందన్నారు. అదనపు లోడ్ను క్రమబద్ధీకరించుకుంటే ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యంపై పూర్తి స్పష్టత వస్తుందన్నారు. అదనపు లోడు క్రమబద్ధీకరణకు డిపార్టుమెంటుకు చెల్లించాల్సిన రుసుములో 50 శాతం రాయితీతో ఏపీఎస్పీడీసీఎల్ వెబ్సైట్ www.apspdcl.on, సమీపంలోని మీ సేవ, గ్రామ, వార్డు సచివాలయాల్లో చెల్లించవచ్చని తెలిపారు. ఈ అవకాశం ఏప్రియల్ 30 వరకు ఉందన్నారు.

రైతుల వద్దకే ప్రజా ప్రభుత్వం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - ఆత్రేయపురం : రైతుల వద్దకే ప్రభుత్వాన్ని తీసుకొస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. ఆత్రేయపురం లొల్ల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో గ్రామాల్లోని రైతు సేవ కేంద్రాల ద్వారా రబీ సీజన్ ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని చెప్పారు. ధాన్యం సొమ్మును రైతుల ఖాతాల్లో వేయడానికి 48 గంటలు సమయం ఇచ్చినా కేవలం రెండు గంటల వ్యవధిలో సొమ్ములు జమ చేయడం జరిగిందని చెప్పారు. రైతే రాజు అన్న మాటను నిజం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే సత్యానందరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్), కరుటూరి నరసింహారావు, కాయల జగన్నాథం, దాట్ల సూర్యనారాయణ, కల్లూరి సత్తిపండు మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

రోడ్డు పనులకు శంకుస్థాపన

మండలం కేంద్రంలో వద్దిపర్రు గ్రామంలోనీ అమలాపురం, బొబ్బర్లంక ప్రధాన రహదారి నుండి రజకుల పేటకు

వయా ఏటిగట్టు మీదుగా ఎంపీ లాడ్స్ (రాజ్యసభ) నిధుల నుంచి రూ.50 లక్షల రూపాయల అంచనాలతో వేయనున్న నూతన తారు రోడ్డుకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శంకుస్థాపన చేశారు. అలాగే గోదావరి గట్టు నుంచి ఎస్సీ కాలనీ మీదుగా వద్దిపర్రు పంచాయితీ కార్యాలయానికి వెళ్లే ప్రధాన రహదారిని అభివృద్ధి పరుచుటకు ఎంపీ లాడ్స్ (రాజ్యసభ) నుండి 50 లక్షల రూపాయలతో నిర్మాణ పనులకు ఎమ్మెల్యే సత్యానందరావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్), కరుటూరి నరసింహారావు, కాయల జగన్నాథం, పిఎస్ రాజు, జుజ్జవరపు శ్యామల హరిబాబు, జుజ్జవరపు రమేష్, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మంచినీటి ఎద్దడి నివారణకు నిధులు మంజూరు

విశాలాంధ్ర- దేవరపల్లి: దేవరపల్లి మండలంలో ప్రతి గ్రామంలో వేసవిలో మంచినీటి ఎద్దడి నివారణకు మండల పరిషత్తు 2025- 2026 15వ ఫైనాన్స్ నిధుల నుండి 22 లక్షల 50 వేలు కేటాయించినట్లు దేవరపల్లి మండల పరిషత్ అధ్యక్షుడు కె వి కె దుర్గారావు పేర్కొన్నారు. దేవరపల్లి మండల పరిషత్‌లో ఆయన మాట్లాడుతూ దేవరపల్లి పంచాయతీకి అదనంగా కొత్త మోటారు ఏర్పాటుకు ఇతర సామాగ్రికి 1,50,000, దేవరపల్లి ఇందిరమ్మ కాలనీలో కొత్త మోటారు సామాగ్రికి నాలుగు లక్షల రూపాయలు కేటాయించినట్లు తెలిపారు. ఎర్నెగూడెం పంచాయతీకి మోటారు ఇతర సామాగ్రికి 1,50,000 , సంగాయిగూడెం గ్రామ పంచాయతీకి 1,50,000, లక్ష్మీపురం గ్రామ పంచాయతీకి 1,50,000, రామన్నపాలెం పంచాయతీకి ఒక లక్ష యాభై వేలు, కురుకూరు గ్రామపంచాయతీకి 1,50,000, దుమంతుల గూడెం పంచాయతీకి 1,50,000, బందపురం పంచాయతీకి 1,50,000, త్యాజంపూడి పంచాయతీకి 1,50,000, యాదవోలు పంచాయతీకి 1,50,000, పల్లంట్ల పంచాయతీకి ఒక లక్ష యాభై వేలు సంగాయిగూడెం లోని మంచి లునీటి ట్యాంకు కు మరమ్మతుకు 2 లక్షల రూపాయలు మంజూరు తీర్మానం చేసినట్లు ఎంపీపీ దుర్గారావు తెలిపారు.

బీఎల్ఓలతో ఆర్డీవో మళ్లీ బాబు సమావేశం

విశాలాంధ్ర - కరప : స్థానిక మండల పరిషత్ చంద్రన్న సమావేశ కార్యాలయంలో రెవెన్యూ డివిజనల్ అధికారి మళ్లీ బాబు మండల బీఎల్ఓ అధికారులతో సమావేశం నిర్వహించారని తహసీల్దార్ నందిపాటి సత్యనారాయణ పేర్కొన్నారు. ప్రతి మూడు నెలలకు బీఎల్వోస్తో సమీక్ష నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా పరిశీలించవలసి ఉంటుందని ఆర్డీవో పేర్కొన్నారు. దీనికి సంబంధించి పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయం సిబ్బంది పనిచేయాలన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

విశాలాంధ్ర - కరప : కరప మండలంలో 15 ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతు సేవ కేంద్రాల యందు ఏర్పాటు చేయడం జరిగిందని మండల అగ్రికల్చర్ ఆఫీసర్ ఏ రాజేష్ పేర్కొన్నారు. ఈ కేంద్రాలలో డేటా ఎంట్రీ ఆపరేటర్, టెక్నికల్ అసిస్టెంట్, హెల్పర్, వ్యవసాయ సహాయకులు రైతుల నుండి ధాన్యం కొనుగోలు సేకరణ చేయడం జరుగుతుందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను మూడు విభాగాలుగా విభజించడం జరిగింది. ఏ కేటగిరిలో 9 బి కేటగిరీలో 5 సి క్యాటగిరిలో 2 ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతులు ధాన్యం విక్రయించిన తర్వాత బయోమెట్రిక్ వేసి, ఫండ్ ట్రాన్స్‌ఫర్ కాఫీ లేదా ఎఫ్టీఓ కాఫీ తీసుకోవాలని ఏవో రాజేష్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నందిపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

'గట్టి'కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే బండారు

విశాలాంధ్ర - కడియం : ఇటీవల మరణించిన మండలం లోని బుర్రిలంక గ్రామానికి చెందిన మాజీసర్పంచ్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ గట్టి సత్యనారాయణమూర్తి కుటుంబాన్ని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు గురు వారం పరామర్శించారు. ముందుగా సత్యనారాయణ మూర్తి చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, చిలువూరి సతీష్ రాజు, గ్రామ మాజీ సర్పంచ్ పుల్లా రామారావు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సింగరంపాలెంలో మూడు కోట్ల 29 లక్షలతో 33/11 కెవి విద్యుత్ ఉపకేంద్రం నూతన సబ్ స్టేషన్‌కు గురువారం జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ భూమి పూజ చేసి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరిం చారు. గండేపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పోతుల మోహనరావు తన తండ్రి పోతుల వీర్రాజు జ్ఞాపకార్థం ఈ సబ్ స్టేషన్ నిర్మాణానికి కావలసిన స్థలాన్ని 40 సెంట్లు ప్రభుత్వానికి అందించారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ సింగరంపాలెం గ్రామానికి ఐదు కోట్ల రూపాయల నిధులతో ఇచ్చారని అందులో కోటి 30 లక్షల రూపాయలతో గండేపల్లి సింగరాయపాలెం తారు రోడ్డు వేయడం జరిగిందని మూడు కోట్ల 29 లక్షల రూపాయలతో విద్యుత్ సబ్ స్టేషన్, గ్రామంలో సిమెంట్ రోడ్లు నిధులు అందించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ముఖ్యంగా సింగరంపాలెం, రామయ్యపాలెం, ఎన్ టి రాజాపురం గ్రామాల్లో లో వోల్టేజ్ సమస్యతో ప్రజలు రైతులు చాలా ఇబ్బందులు గురవుతున్నారని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు తెలపడంతో ఆయన వెంటనే విద్యుత్ అధికారులతో మాట్లాడి ప్రభుత్వానికి నివేదిక పంపించి వెంటనే శాంక్షన్ రప్పించడంతో మా తండ్రి పేరిట 40 సెంట్లు స్థలాన్ని ఇచ్చి సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించమన్నారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ

గండేపల్లి మండలంలో మొత్తం ఏడు సబ్ స్టేషన్ లు ఉండగా తెలుగుదేశం ప్రభుత్వం ఆరు నిర్మించింది అని అన్నారు. దీనివల్ల సింగరంపాలెం రామయ్య పాలెం ఎన్‌టి రాజా పురం గ్రామాలకు చెందిన దాదాపు మూడు ఫీడర్లలో ఉన్న 400 బోర్లకు సమృద్ధిగా కరెంటు అందుతుందని ఇళ్లకులో వోల్టేజ్ సమస్య తీరుతుందన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరు సోలార్ విద్యుత్తు ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కోర్పు లచ్చయ్య దొర, ఎస్వీఎస్ అప్పలరాజు, పోతుల మోహనరావు, కోర్పు సాయి తేజ, అడబాల భాస్కర రావు, కొత్త కొండబాబు, కుంచె రాజా, కం దుల చిట్టిబాబు, ఎంపీపీ చలగల్ల దొరబాబు, అవసరాల సుబ్రహ్మణ్యం, బొల్లం రెడ్డి రామకృష్ణ, పాలకుర్తి ఆదినారాయణ, యర్రం శెట్టి బాబ్జి విద్యుత్ ఎస్ ఈ గౌర్ల ప్రసాద్, ఈ ఈ జగ్గంపేట బలభద్రపు వీరభద్రరావు, డిఈఈకే మలాకి, డిఈఈ కన్స్ట్రక్షన్ బి జ్యోతి, ఏఈ గండేపల్లి ఎస్ కిరణ్ కుమార్, ఏఈ కన్స్ట్రక్షన్ పి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల హక్కులు, సాధికారతపై అవగాహన

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం మహిళా సాధికారత, ఫిర్యాదు బృందం వారు 'మహిళల హక్కులు, సాధికారత కార్యాలయ వేధింపులు, వివక్షతను నివారించడంపై అవగాహన సెషన్ జరిపినట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ పి కృష్ణారావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ న్యాయవాది ఎన్ సునీత సభని ఉద్దేశిస్తూ, మహిళలకు సాధికారత కల్పించడం అంటే మానవాళికి సాధికారత కల్పించడం-మహిళలు ఎదిగినప్పుడు, సమాజం అభివృద్ధి చెంది ప్రపంచం ముందుకు సాగినట్లని వివరించారు. మేనేజ్‌మెంట్ డైరెక్టర్ ఎంవి హరనాథబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం సతీష్, డైరెక్టర్ అకాడెమిక్స్ డాక్టర్ కె సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ డా జి నరేష్, మహిళా సాధికారత సెల్ సభ్యులు డాక్టర్ వి శైలజ, డీన్ సిడిసి డాక్టర్ ఎం రాధికామణి, ఎం మాధవి, వివిధ విభాగాధిపతులు, సమన్వయకర్తలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి శ్రీ చైతన్య స్కూల్లో గురువారం ఎల్కేజీ నుంచి 5వ తరగతి వరకు చదివిన విద్యార్థుల స్నాతకోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ప్రైమరీ జోనల్ ఇంచార్జ్ షమ్మీ బేగం మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. తల్లిదండ్రులు ఇంటి వద్ద వారిని చదివించాలని కోరారు. తల్లిదండ్రులు సహకారం ఎంతో అవసరమని వారి అభ్యున్నతికి తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. ఏజీఎం పార్థసారథి మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులు శ్రద్ధగా చదవాలని సూచించారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు షీల్డ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వినూత్న, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులను వెలికితీయడమే లక్ష్యం

విశాలాంధ్ర - కొవ్వూరు : మట్టిలో దాగిన మాణిక్యాలను వెలికి తీయడమే లక్ష్యంగా శ్రీ చైతన్య విద్యాసంస్థలు పనిచేస్తున్నాయని శ్రీ చైతన్య స్కూల్ రాజమండ్రి జోన్ ఆర్ ఐ వి ఉదయ శంకర్ అన్నారు. నేషనల్ ఏరోనాటికల్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ వారు దేశవ్యాప్తంగా నిర్వహించిన స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్లో విజయం సాధించిన 60 ప్రాజెక్టుల్లో 30 ప్రాజెక్టులు శ్రీ చైతన్య విద్యా సంస్థలు దక్కించుకోవడం తోపాటు కొవ్వూరు శ్రీ చైతన్య స్కూల్ కి మొదటి బహుమతి రావడం పట్ల కొవ్వూరు శ్రీ చైతన్య స్కూల్ నందు సంబరాలు నిర్వహించారు. అనంతరం కొవ్వూరు పట్టణ పురవీధుల గుండా విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కొవ్వూరు శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్ ఎస్ వి డి మధుబాబు మాట్లాడు తూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడంతోపాటు వారిలోని ప్రతిభను వెలికి తీయడమే లక్ష్యంగా శ్రీ చైతన్య విద్యాసంస్థలు పనిచేస్తున్నా యన్నారు. జాతీయస్థాయిలో అంతరిక్షంపై అవగాహన కొరకు నాసా ఆధ్వర్యంలో నిర్వహించిన స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్లో కొవ్వూరు శ్రీ చైతన్య విద్యార్థులు రూపొందించిన స్పేస్ కాలనీ (ఎయుఆర్ఎ) ప్రాజెక్ట్ మొదటి బహుమతి సాధించడం ఎంతో సంతోషాన్ని కలిగిందన్నారు. శ్రీ చైతన్య విద్యాసంస్థ అకాడమిక్ కోఆర్డినేటర్ కె కిరణ్ పాండే, అరుణ్ కుమార్ మరియు కొవ్వూరు శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధే లక్ష్యం

విశాలాంధ్ర - కొవ్వూరు : ప్రజల అవసరాలను గుర్తించి పట్టణ అభివృద్ధి లక్ష్యంగా మున్సిపాలిటీ పనిచేస్తుందని కొవ్వూరు మున్సిపల్ చైర్పర్సన్ భావన రత్నకుమారి అన్నారు. 15వ ఆర్థిక నిధుల నుంచి 10 లక్షల రూపాయల వ్యయంతో కొవ్వూరు పట్టణంలోని నాలుగో వార్డ్ నందు డ్రైనేజీ స్లాబ్ నిర్మాణ పనులను చైర్పర్సన్ భావన రత్నకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ భావన రత్నకుమారి మాట్లాడుతూ పట్టణంలో ప్రజల అవసరతలను గుర్తించి ఆయా వార్డులలో అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని 15 ఆర్థిక నిధుల నుంచి గతంలో పది లక్షల రూపాయల వ్యయంతో కొంతమేర డ్రైనేజీ

స్లాబ్ నిర్మించడం జరిగిందని మరల 10 లక్షల రూపాయల వ్యయంతో కొంతమేర డ్రైనేజీ ల్యాబ్ నిర్మాణ పనులను నేడు ప్రారంభించడం జరిగిందన్నారు. కాంట్రాక్టర్ శ్రీ విజయలక్ష్మి ఇంజనీరింగ్ వర్క్స్ పెరమళ్ళ ఉమామహేశ్వరరావు, నిర్మాణ పనులను అప్పగించడం జరిగిందన్నారు. నాణ్యతతో కూడిన స్లాబ్ నిర్మాణం చేపట్టాలని నాణ్యత లోపిస్తే ఉపేక్షించేది లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ సందీప్, మాజీ కౌన్సిలర్ భావన రాజేష్, కాంట్రాక్టర్ పెరుమళ్ళ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

యనమలకు శుభాకాంక్షలు

విశాలాంధ్ర - అనపర్తి : శాసనసభ మాజీ స్పీకర్, మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడుకి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శు భాకాంక్షలు తెలిపారు. శనివారం 42 వసంతాల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా యనమల రామకృష్ణుడిని తుని నియోజకవర్గం తేటగుంటలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి, శు

భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (దత్తుడు (శ్రీను), నల్లమిల్లి గోపాలకృష్ణారెడ్డి, కర్రి చిన్నారెడ్డి,నల్లమిల్లి సుబ్బారెడ్డి, ఒగిరెడ్డిరాధ, సత్తి దేవదానరెడ్డి, మామిడిశెట్టి శ్రీను,బాబూరావు,రావాడ నాగు పాల్గొన్నారు.

నర్సరీ రైతు సమస్యల పరిష్కారానికి కృషి : సోము

విశాలాంధ్ర - కడియం : భారతీయ జనతా పార్టీ తరపున ఇటీవల ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యు లుగా ఎన్నికైన సోము వీర్రాజును, సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రత్నం అయ్యప్ప మరియు పాలకవర్గ సభ్యులు రాజమహేంద్ర వరంలో కలిసి, మొక్కను ఇచ్చి, దుస్సలువా మెమం టోతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. అసోసియేషన్ సభ్యులు బోడపాటి గోపాలకృష్ణ, కొండేపూడి నాగు, తడల నాగేశ్వరరావు, గాజుల రత్తయ్య, రత్నం బాబ్జీ, పిల్లా శ్రీనివాస్, గాద నాగేశ్వరరావు, క్రొవ్విడి వాసు, బొరుసు సుబ్రమణ్యం, ముద్రగడ జెమి పాల్గొన్నారు.

అపరాల సాగుకు విత్తనాలు సిద్ధం

విశాలాంధ్ర గోపాలపురం : వేసవికాలంలో అపరాల సాగు ద్వారా రైతులు అదనపు ఆదాయాన్ని పొందాలని మండల వ్యవసాయ అధికారి బి రాజారావు కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేసవిలో నేలను ఖాళీగా ఉంచకుండా 365 రోజులు గ్రీన్ కవర్‌తో కప్పి ఉంచడం వల్ల భూసారం అభివృద్ధి చెందడంతో బాటు రైతుకు అదనపు ఆదాయం వస్తుంద తెలిపారు. మండలానికి 7.8 క్వింటాల్ మినుము, మరియు 40 క్వింటాళ్ల పెసర విత్తనాలు రైతు సేవా కేంద్రాలలో అందుబాటులోకి తెచ్చినట్లు వీటిని 50% రాయితీపై రైతులకు సరఫరా చేసి మరలా ఈ పంట ద్వారా నమోదు చేయనున్నట్లు తెలిపారు. వీటితో బాటుగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ద్వారా నవధాన్యాలు (9 రకాల వివిధ జాతుల విత్తనాలు) కూడా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. జనుము, జీలుగ, పెసర, పిల్లి పెసర, అలసంద వంటి పైర్లను పూ మొగ్గ దశ వరకు పెంచి భూమిలో కలియ దున్నడాన్ని పచ్చిరొట్ట ఎరువుగా పరిగణిస్తారు. పర్యావరణం దెబ్బతినకుండా ఉంటుంది. రసాయనిక ఎరువుల ఖర్చు తగ్గి నాణ్యమైన దిగుబడులు పెరుగుతాయన్నారు.

ఘనంగా పృథ్వీరాజ్ జన్మదినం

విశాలాంధ్ర - ముమ్మిడివరం : ముమ్మిడివరం నియోజకవర్గ యువకిశోరం దాట్ల పృథ్వీరాజ్ పుట్టినరోజు వేడుకలు గురువారం ముమ్మిడివరం కొమానపల్లి గెస్ట్ హౌస్ దగ్గర కుంచనపల్లి నారాయణ ఏర్పాటు చేసిన జన్మదిన కార్యక్రమంలో పృథ్వీరాజ్ పాల్గొని భారీ కేక్ కట్ చేసి, ఆయనకు అనేకమంది నాయకులు పూలకుచ్చాలతో శాలువతో ఆయనను సన్మానించారు. అన్నా క్యాంటీన్లో పేదలకు ఉచితంగా భోజన సదుపాయం 14వ వార్డు యూత్ ఏర్పాటు చేశారు. ముమ్మిడివరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, రాష్ట్ర ఎస్సీ

కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్, రాష్ట్ర టిడిపి కార్యదర్శి గుత్తుల సాయి, గొల్లకోటి దొరబాబు, అర్థాన్ని శ్రీనివాసరావు, దొమ్మేటి రమణ కుమార్, ములపర్తి బాలకృష్ణ, కడలి నాగు, కట్ట సత్తిబాబు, దివి విజయ్, దివి మహాలక్ష్మి, మాదాల నాగ సత్య మంగాకుమారి బుజ్జి, గోదాసి పుష్పిష్, గుద్దటి జమ్మి, చిక్కాల అంజిబాబు, పాల్గొన్నారు.

అబార్షన్ కిట్లు, వయాగ్రా టాబ్లెట్స్ సీజ్

విశాలాంధ్ర - రాజానగరం : ప్రభుత్వ అనుమ తులు లేని అబార్షన్ కిట్లు, వయాగ్రా టాబ్లెట్స్ గుర్తించి సీజ్ చేశామని డ్రగ్స్ ఇన్స్పెక్టర్ పి.కళ్యాణి పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఒక ప్రకటన గురువారం విడుదల చేశారు. దీనిలో భాగంగా ఆమె మాట్లాడుతూ రాజానగరం మండలం కలవచర్లలో మెడికల్ రిప్రజెంటేటివ్ ఏ. విష్ణుమూర్తి వద్ద లైసెన్స్ లేకుండా ఉన్న అబార్షన్ కిట్లు, వయాగ్రా టాబ్లెట్స్‌ని గుర్తించి, సీజ్ చేశామని చెప్పారు. పాలకొల్లులో ఒక మెడికల్ షాప్‌లో చేసిన తనిఖీలో ఈ మందులు దొరకడంతో ఆరా తీసిన అధికారులకు విష్ణుమూర్తి వాటిని సరఫరా చేస్తున్నాడని తెలిసిందన్నారు. దీంతో గురువారం అతని నివాసంలో తనిఖీ చేయడంతో గుట్టు, రట్టయిందని తెలిపారు.

ట్రాక్టర్ ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - సీతానగరం: ట్రాక్టర్ ప్రమాదంలో వ్యక్తి మృతి. మండలంలో గల రఘుదేవపురం గ్రామ పంచాయతీ పరిధిలో రవీంద్ర కాలనీ వద్ద గల ఇటుక బట్టి యజమాని సిద్దా వెంకటేశ్వరరావు వయస్సు 45 ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రఘుదేవపురం గ్రామానికి చెందిన సిద్దా వెంకటేశ్వరరావు భార్య దుర్గా భారతి ఇటుక బట్టి యజమాని రోజు లాగే గురువారం ఉదయం 5గంటలకు ఇటుక బట్టి వద్దకు చేరుకొని పనులు చేస్తుండగా ఉదయం 10:30 గంటలకు బట్టిలో అదుసు తొక్కుతున్న ట్రాక్టర్ ప్రమాదానికి గురై మరణించారు. అక్కడ ఉన్న స్థానికుల ఆసుపత్రికి తరలించినా ఉపయోగం లేక పోయింది. దీనిపై భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనలో గ్రామంలో విషాదఛాయలు అల్లుకొని ఆ కుటుంబానికి సానుభూతి తెలుపుతూ ధైర్యంగా ఉండాలన్నారు.

ముద్దాయికి 14 రోజులు రిమాండ్

విశాలాంధ్ర - చాగల్లు: గత నెల ఉనగట్ల గ్రామానికి చెందిన బోనం సుబ్బారావు అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన ధూపాటి శ్రీనివాస్, అతని కుమారుడు రామ సత్యనారాయణ ఇరువురు కొట్టడం వల్ల సిమెంటు రోడ్డుపై పడి తలకి బలమైన గాయం అయ్యి చికిత్స పొందుతూ కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో గురువారం మరణించారు. సదరు కేసులో కొవ్వూరు సీఐ విజయ్ బాబు ఆదేశాలతో స్థానిక చాగల్లు స్టేషన్ ఎస్ఐ నరేంద్ర ముద్దాయిలను అరెస్టు చేసి కోర్టు ఎదుట హాజరు పరచగా గౌరవ న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు.

డీసీహెచ్ఎస్‌ను కలిసిన ఉద్యోగుల సంఘ నాయకులు

విశాలాంధ్ర - కడియం : ఇటీవల నూతనంగా పదోన్నతిపై తూర్పుగోదావరి జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారిణిగా భాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఎం. పద్మను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉద్యోగుల సంఘం (ఏపీజీఇఏ) తూర్పుగోదావరి జిల్లా శాఖ నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె అసోసియేషన్ తరపున పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరినట్లు, అందుకు తాము సహకరిస్తామని బదులిచ్చినట్లు సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు పి. రవికుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని తరగతుల సిబ్బందికి చిన్న చిన్న సమస్యలు ఉన్నాయని, వాటి విషయమై అసోసియేషన్ తరపున గత 15 రోజుల క్రితం జాయింట్ మీటింగ్ ఏర్పాటు నోటీసు ఇచ్చామని, త్వరితగతిన జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించగలరని ఆశాభావం వ్యక్తం చేసారు. అసోసియేషన్ నూతన డైరీని ఆమెకు ఈ కార్యక్రమంలో సీనియర్ ఫార్మసీ ఆఫీసర్ ఏ. రవికుమార్, నర్సింగ్ ఆఫీసర్ పలీమా పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాలు : కలెక్టర్

విశాలాంధ్ర - కాకినాడ : ప్రత్యేక అవసరాలగల పిల్లలు తమ దైయానందిన జీవితంలో ఎవరి మీద ఆధారపడకుండా తమ పనులు చేసుకునేందుకు ఉపకరణాలు ఎంతగానో సహాయపడతాయని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. గురువారం కాకినాడ సాలిపేట మున్సిపల్ బాలికల పాఠశాలలో జిల్లా పాఠశాల విద్యాశాఖ-సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాల గల విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్..జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ జీ నాగమణి, జిల్లా విద్యాశాఖ అధికారి పి రమేష్, సమగ్రశిక్ష పీఓ పీ వేణుగోపాల్, విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల శాఖ ఇన్చార్జి ఏడీ, జెడ్పీ సీఈవో లక్ష్మణరావు తదితరులతో కలిసి హాజరై, ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు అలెన్కో సంస్థ ద్వారా సమకూర్చిన వీల్ చైర్స్, ట్రై సైకిల్, వినికిడి యంత్రాలు, టీఎల్ఎం కిట్లు ఇతర ఉపకరణాలను అందజేశారు. ఈ పరికరాల ద్వారా ప్రత్యేక అవసరాలుగల చిన్నారులు తమ దైనందిన జీవితంలో ఎవరి మీద ఆధారపడకుండా తమ పనులు చేసుకునేందుకు ఈ ఉపకరణాలు ఎంతగానో సహాయపడతాయని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ జి నాగమణి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న 272 మంది ప్రత్యేక అవసరాలుగల చిన్నారులకు 34 రకాల ఉపకరణాలను పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అలెన్ కో ప్రతినిధిరాజబాబు, ఐఈ కో ఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు, విద్యా శాఖ అధికారులు బి శివప్రసాద్, జి పైడిరాజు, జీసీడీఓ పి ఉమామహేశ్వరి, ఏఎస్వో కె. జోగి రెడ్డి ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ దినాలు పాటిద్దాం

విశాలాంధ్ర - నిడదవోలు : తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్, బీఆర్ అంబేద్కర్ కళావేదిక వద్ద దళిత, పీడిత కులాల ఆత్మగౌరవ పోరాట దినాలుగా పాటిద్దాం వాడవాడలా పూలే, అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా జరుపుకుందాం అనే నినాదంతో కుల నిర్మూలన పోరాట సమితి ఉమ్మడి తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల ప్రధాన కార్యదర్శి గెడ్డం రవీంద్రబాబు అధ్యక్షతన కరపత్రాలు ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రవీంద్ర మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడం కోసం అగ్రకుల ఆధిపత్య శక్తులు దళితులపై దాడులుచేస్తూ అత్యాచార, హత్యలకు పాల్పడుతున్నారు. వాళ్లకు కొమ్ము కాస్తూ పోలీసులు ఎస్సీ ఎస్టీ యాక్ట్ చట్టాలను నీరు కారుస్తున్నారు. మరొకవైపు గత ప్రభుత్వం అనుమతి పొందిన 15 వైద్య కళాశాలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టి వైద్యాన్ని వ్యాపారం చేస్తున్నారు. అదే సమయంలో రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు పేదరిక నిర్మూలన పేరుతో మొదటి విడతగా 20 లక్షల కుటుంబాలను పేదరికం నుండి బయటకు తీసుకొస్తామని మార్గదర్శి బంగారు కుటుంబం బిఫోర్ వంటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టమని కార్పొరేట్ శక్తులే పేదల ఆర్థిక ఎదుగుదలకు దోహదపడతాయని నమ్మబలుకుతున్నాయన్నారు. ప్రజలు సంక్షేమానికి కృషి చేయాల్సిన కూటమి ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పుకుని కార్పొరేట్ శక్తుల దయతో మాత్రమే పేదలు ఎదగాలని ప్రజలకు హితబోధలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ముప్పిడి శ్రీను, దిద్దేరాజు, కునుపో చందు, ఎల్లమెల్లి రవితేజ, సతీష్ రాజు, గన్ను మహేష్, తదితరులు పాల్గొన్నారు.

జామాయిల్ నరికిన వారిపై కేసు నమోదు

విశాలాంధ్ర గోపాలపురం : మండలంలోని బీమోలు గ్రామ రెవెన్యూ పరిధిలో షేక్ యాకుబ్‌కు చెందిన 5 ఎకరాలలో లో ఉన్న జామాయిల్ తోటను నరికిన వారిపై చర్యలు చేపట్టాలని అదే బీమోలు గ్రామానికి చెందిన13 మంది పై షేక్ యాకూబ్ సాహెబ్ ఫిర్యాదు చేశారు. ఈ 13 మంది ఒక అసాంఘిక ముఠాగా ఏర్పడి అక్రమముగా జామయిలు తోటలోకి ప్రవేశించి ఈనెల 4న తోట యజమాని అనుమతి లేకుండా 5 ఎకరాలలో జామయిలు తోటను నరికివేసి దొంగతనం గా అక్కడనుండి జామయిలు కర్రలను తీసుకొని వెళ్లిపోయ్యారని షేక్. యాకుబ్ సాహెబ్ ఫిర్యాదు చేయగా ఫిర్యాదు ప్రకారం మొత్తం 13 మంది భీమోలు గ్రామానికి చెందిన వారిపై గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చెయ్యడం జరిగింది. దర్యాప్తు అనంతరం ఈ నేరముకు పాల్పడిన బాధ్యుల మీద చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకొనబడి వారిని అరెస్ట్ చేస్తామన్నారు. ఈ ఫిర్యాదులో ముద్దాయిలుగా బెజవాడ రవీంద్ర. పెనుమాక మోసే, పెనుమాక హేమంత్, కండెల్లి దాసు,ముప్పిడి రామకృష్ణ..ముప్పిడి రాజేష్, అర్జంగి రాంబాబు, నేకూరి బాలకృష్ణ, బెజవాడ మోహన్ రావు, కండెల్లి వెంకటరావు, ప్రత్తిపాటి చందు, వేములూరి రాంబాబు, ఈతకోట పెంటయ్య అను 13మంది పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై.సతీష్ కుమార్ తెలిపారు.

జర్నలిస్టు అసోసియేషన్ మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర - పిఠాపురం : పిఠాపురం మున్సిపల్ కార్యాలయం పక్కన మార్కెట్ సెంటర్లో పిఠాపురం జర్నలిస్ట్స్ అసోసియేషన్ (పిజెఏ) ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం పిఠాపురం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా పాత్రికేయులు భారీ ఎత్తున నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి శ్రీనివాస్, పిఠాపురం జర్నలిస్ట్స్ అసోసియేషన్ (పిజెఏ) గౌరవాధ్యక్షుడు కొండేపూడి శంకర్రావులు విచ్చేసి రిబ్బన్ కటింగ్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సిఐజి శ్రీనివాస్ మాట్లాడు తూ నిత్యం ప్రజా సమస్యలపై తమ కలంతో గళాన్ని వినిపించే పాత్రికేయులు ఇలా సామాజిక సాంఘిక కార్యక్రమాలు చేయడం అభినందనీయ మన్నారు. మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించడం సంతోషదాయకమన్నారు. కొండేపూడి శంకర్రావు మాట్లాడుతూ జీతభత్యాలు లేని పాత్రికేయులు తమ సొంత ఖర్చులతో ఇలాంటి సామాజిక కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు చేపట్టడం స్ఫూర్తిదాయకమన్నారు. పిఠాపురం జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాయుడు శీనుబాబు ఈ అసోసియేషన్ తరపున ప్రతివారం నియోజకవర్గంలోని 3 మండలాల్లో ఈ మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిం చాలని సంకల్పం చేశామన్నారు. పిఠాపురం జర్నలిస్ట్స్ అసోసియేషన్ సభ్యులు సెక్రెటరీ వేగా న్యూస్ చైర్మన్ శ్యాంప్రసాద్, ట్రెజరర్ ఆర్కె టీవి రామకృష్ణ, మెంబర్స్ సింహగర్జన పత్రికా సంపాదకుడు సునీల్ కుమార్ యాంద్ర, ఆంధ్రరేఖ బ్యూరో దడాల సత్తిబాబు, సీనియర్ జర్నలిస్ట్ దాకే సింహాచలం, మైటివి రిపోర్టర్ ఏ లక్ష్మణ్, మనవార్త రిపోర్టర్ కిషోర్, ఆంధ్రరేఖ రిపోర్టర్ రమేష్, గళం రిపోర్టర్ డి సతీష్, వెలుగు రిపోర్టర్ సోమేశ్వరరావు, ఆజాద్ రిపోర్టర్ పి జనార్దన్, ఆర్టిఐ రిపోర్టర్ కామేశ్వరరావు (దొరబాబు), భారత్ రిపోర్టర్ సాగర్ తదితర పాత్రికేయులు పాల్గొన్నారు.

సీవీ రామన్ విద్యార్థులకు అంతర్జాతీయ ర్యాంకులు

విశాలాంధ్ర - అమలాపురం : ప్రతిష్ఠాత్మక ఒలింపియాడ్ ఫౌండేషన్ ఎడుహంట్ నిర్వహించిన ఒలింపియాడ్ పరీక్షల్లో అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకుల సాధించిన సర్ సివి రామన్ విద్యార్థులకు పతకాలు సర్టిఫికెట్స్ అందజేసినటువంటి సర్‌సివి రామన్ డైరెక్టర్ వేణుగోపాలరావు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యార్థులు ఎదుర్కోబోయే ఐఐటి పరీక్షల్లో అత్యంత సులువుగా విజయం సాధించేలా ఫౌండేషన్ కోర్స్ అత్యుత్తమ ఆధునిక విధానాలతో శిక్షణ అందిస్తూ విద్యార్థులను పోటీ ప్రపంచానికి దీటుగా తయారు చేయడంలో సర్ సివి రామన్ పాఠశాల ఎప్పుడు ముందుంటుందన్నారు. ఈ అభినందన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు, ప్రిన్సిపల్ ఎన్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపల్ కే పెద్దిరాజు విజయం సాధించిన విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లా రామ చంద్రపురం నియోజవర్గం కోలంక గ్రామంలో కిరణ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో, బాబా యువజన సంఘం ప్రోగ్రాం ఆఫీసర్ గుంటూరు మాణిక్యం నేతృత్వంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయులు బుద్ధిష్ట్ శ్రీరాములు, మాట్లాడుతూ ఈ శిబిరంలో 130 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 30 మందికి కళ్ళజోళ్ళు అందించగా, మరో 30 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించినట్లు తెలిపారు. అదేవిధంగా కళ్ళ సమస్యలు వచ్చే సమయంలో వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ, డాక్టర్ చిట్టి కాసులు, బొండా వెంకన్న, కిరణ్ కంటి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - కాకినాడ : రామచంద్రపురం నియోజ కవర్గం రామచంద్రాపురంకి చెందిన టాటా మ్యాజిక్ డ్రైవర్ సిద్దనాతి పవన్ సాయి కుమార్ (నాని) ఇటీవల ప్రమాదవశాత్తు జరిగిన యాక్సిడెంటు కారణంగా మరణించారు. ఘటన తెలిసిన వెంటనే, లక్ష్మీ గణపతి టాటా మ్యాజిక్ యూనియన్ ప్రెసిడెంట్ , కమిటీ సభ్యులు ఆల్ ఆంధ్ర మ్యాజిక్ ఫ్రెండ్స్ గ్రూప్ అడ్మిన్‌లకు సమాచారం తెలియగానే మానవత్వంతో ముందుకు వచ్చి గ్రూప్ సభ్యులు అందరూ కలిసి తమ వంతు సహాయంగా రూ. 1,16,147ను సేకరించి, రవాణా శాఖ అధికారి రాజేంద్ర ప్రసాద్ చేతుల మీదుగా పవన్ సాయికుమార్ కుటుంబానికి అందించారు. కొయ్యలగూడెం అడ్మిన్ సత్యనారాయణ, అన్నవరం అడ్మిన్ కొండబాబు, రాజనగరం అడ్మిన్ వెంకటేష్, వరప్రసాద్, వాలిశెట్టి శీను, గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం

విశాలాంధ్ర - ఏలేశ్వరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల 16వ వార్షికోత్సవం ప్రిన్సిపల్ డాక్టర్ డి సునీత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్‌జెడి డాక్టర్ ఎస్ శోభారాణి, విజయ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఎస్ విజయబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్‌జెడి శోభారాణి మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా వారిలోని సృజనాత్మకత పెంపొందుతుందన్నారు. డాక్టర్ విజయబాబు మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు, బెట్టింగ్ యాపులకు, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థులు పలు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ప్రగడ ప్రయాగమూర్తి, అధ్యాపకులు వి రామారావు, కే సురేష్ తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ సెంటర్లో సౌకర్యాలు కల్పించాలి

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం : డయాలసిస్ సెంటర్లో మరిన్ని సౌకర్యాలు కల్పించాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు. తాడేపల్లి గూడెం ఏరియా ఆసుపత్రిలో 2016లో మంత్రి కీ.శే. పైడికొండల మాణిక్యాల రావుచే ఉచిత డయాలసిస్ సెంటర్ ప్రారంభించారు. తాడేపల్లిగూడెం చుట్టు పక్కల 40 కిలోమీటర్ల పరిధిలో ఉన్న గ్రామాలలో కిడ్నీ రోగులకు సేవలు అందిస్తోంది . డయాలసిస్ రోగులకు ప్రభుత్వం రూ.10,000 అందిస్తోంది. వారంలో రెండు మూడుసార్లు డయాలసిస్ చేయిం చుకోవాల్సిన అవసరం కిడ్నీ రోగులకు ఉంది. రెండు కిడ్నీలు పనిచేయని వారు అధికంగా ఈ డయాలసిస్‌కు వస్తూ ఉంటారు. ఈ డయాలసిస్ సెంటర్లో 23 బెడ్స్ ఉన్నాయి. రోజుకు 55 మందికి డయాలసిస్ చేస్తూ ఉంటారు. నెలకు 150 మందికి డయాలసిస్ చేస్తూ ఉంటారు. డయాలసిస్ రోగులకు మెరుగైన సౌకర్యం అందించేందుకు సెంట్రల్ ఆక్సిజన్ సిస్టం అవసరం ఉంది. ప్రస్తుతం బీ టైపు ఆక్సిజన్ సిలిండర్లను వాడుతున్నారు. తాడేపల్లిగూడెం బస్టాండ్ నుండి ఏరియా ఆసుపత్రికి రోగులు రావడానికి వీలుగా బస్సు సౌకర్యం 2019లో ఉండేది. ప్రస్తుతం ఉచిత బస్సు సౌకర్యం లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రిపూట రోగులు తిరిగి వెళ్ళడానికి సరైన సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు. డయాలసిస్ రోగులకు మంచినీటి సౌకర్యం కోసం ఆర్వో వాటర్ ప్లాంట్ కూడా ఏర్పాటు చేయవలసిన అవసరం ఉంది. రోగులకు మరింత సౌక ర్యంగా ఉండేందుకు బిల్డింగ్ విస్తరం చాల్సిన అవసరం వుంది.

సీఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తి : మంత్రి

విశాలాంధ్ర ఆగిరిపల్లి: ముఖ్యమంత్రి రాకకోసం ఆగిరిపల్లి ప్రజలు ఎంతో సంతోషంతో ఎదురు చూస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. ఆగిరిపల్లిలో ఈనెల 11న ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను స్థానిక మార్కెట్ యార్డ్‌లో జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డిలతో కలిసి పరిశీలించిన అనంతరం మంత్రి పాత్రికేయులతో మంత్రి పార్థసారథి మాట్లాడుతూ ముఖ్య మంత్రి శుక్రవారం ఉదయం 10. 30 ని.లకు ఆగిరిపల్లి వస్తారని, ముందుగా కులవృత్తుల వారిని పనిస్థలంలో కలిసి వారి పరిస్థితులను పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకుని, వారికి మేలు చేసే కార్యక్రమాలు తెలియజేస్తార న్నారు. అనంతరం ప్రజావేదిక కార్యక్రమంలో ప్రజల సమస్యలను తెలుసుకుంటారని, అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారన్నారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ముఖ్య మంత్రివర్యుల పర్యటన కార్యక్రమానికి విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ విజ్ఞప్తి చేశారు. నూజివీడు నియోజకవర్గంలో మామిడి రైతుల సమస్యలు, రోడ్లు, రిజర్వాయర్ల నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందించడం, లక్ష్మి వ్యాగ్రేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి, తదితర సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని మంత్రి పార్థసారథి చెప్పారు.

పేదవాడి సొంతింటి కళ సాకారం చేయండి : సీపీఐ

విశాలాంధ్ర - అమలాపురం : ముమ్మిడివరం నియోజకవర్గంలో సీపీఐ ప్రచార జాతా నియోజక వర్గ కార్యదర్శి కామ్రేడ్! శీలం వెంకటేష్ నేతృత్వంలో కేశనకుర్రు జనిపెల్ల శివాజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి కె సత్తిబాబు వ్యవసాయ కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ గతంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పల్లెల్లో ఒకటిన్నర సెంటు, పట్టణంలో ఒక సెంటుతో ఇల్లు నిర్మాణానికి స్థలం కేటాయించారని, పట్టాలు ఇచ్చి స్థలం చూపించని లబ్ధిదారులు చాలా మంది ఉన్నారని, పేద ప్రజల పని ప్రదేశానికి దూరంగా జగనన్న కాలనీలు ఏర్పాటు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం చంద్రబాబు ప్రభుత్వం పల్లెలో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇళ్లస్థలాలు కొరకు ప్రజలు దరఖాస్తు చేసుకొంటున్నారు అని వారందరకు ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం ఇంటి స్థలం మంజూరు చేయాలని సత్తి బాబు కోరారు. ముమ్మిడివరం నగర పంచాయతీలో సొంత స్థలం ఉండి ఇంటి పునాది నిర్మాణం చేసుకుని పూర్తి నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం 10 లక్షలు ఇవ్వాలని కోరారు. కమ్యూనిస్టు పార్టీ వీరందరి సమస్యలు తీసుకుని స్థానిక శాసన సభ్యులు దాట్ల సుబ్బరాజు(బుచ్చి బాబు) ముందు ఉంచాలని తద్వారా సొంత ఇంటి స్థలం కలిగి వారికి న్యాయం చేయాలని భావిస్తోందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం హౌసింగ్ కార్పొరేషన్ ఎండిగా యం శివ ప్రసాద్‌కి బాధ్యతలు ఇచ్చింది వీరుపై సమస్యలు ఏడల సానుకూలంగా ప్రభుత్వం పేదల పక్షాన నిలబడి ముందు సాగుతుందని సత్తిబాబు ఆశాభావాన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో వనచర్ల విజయ కుమార్, కుమ్మరి వెంకటేశ్వర రావు, జగడం పాపయమ్మ, సానబోయిన మనోహర్, కామ్రేడ్ పిఎస్ఎస్ రాజు, జి వర్మ, మడికి మహాలక్ష్మి, దిగుమర్తి విజయ, యం మహేష్ పాల్గొన్నారు.

ఎంపీడీవో నాతీ బుజ్జికి అవార్డు

విశాలాంధ్ర - గండేపల్లి : మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఆరు నెలల కాలంలో ఆమె చేసిన విధి నిర్వహణలో అనేక అభినందనలు రావడం తద్వారా సహ ఉద్యోగులతో కలిసిమెలిసి ఉండి పని చేయిస్తూ గ్రామంలో పారిశుధ్య ఉపాధి పథకం ద్వారా పనులను చేయించడంలో ఎంపీడీవో నాతి బుజ్జి నిత్యం కృషి చేస్తూ ఉంటారు. ఉపాధి హామీ పనులు నిర్వహించుటలో మండలాన్ని జిల్లాలో రెండో స్థానంలో నిలిపేందుకు ఆమె చేసిన కృషికి నిదర్శనం దానికి సంబంధించి గురువారం కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ షగిలి, డ్వామా పిడి అడపా వెంకటలక్ష్మి చేతుల మీదుగా ఎంపీడీవో నాతి బుజ్జి, ఏపీవో గంగాభవాని అవార్డు పొందారు. మండలంలో ప్రజా ప్రతినిధులు, ఏవో చంద్రరావు, ఈవీ రమేష్, స్వర్ణలలిత, పంచాయతీ కార్యదర్శులు, మండల సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర - ఏలేశ్వరం : మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని దూరప్రాంత ప్రజలకు దాహార్తిని తీర్చేందుకు ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జ్యోతుల నాగ సత్య శ్రీనివాస్ ఆర్థిక సహకారంతో మజ్జిగ పంపిణీ కార్యక్రమంను గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షులు డాక్టర్ ఎస్ విజయబాబు మాట్లాడుతూ గత నాలుగు గురువారంల నుంచి వేసవిని దృష్టిలో ఉంచుకుని దూర ప్రాంతాల నుండి వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని సమితి సభ్యుల సహకారంతో వితరణ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గొల్ల నాగేశ్వరరావు, తాళ్లూరు గొల్లజీరావు, వరుపుల చిట్టిబాబు, కె సత్యనారాయణ, కోరాడ నారాయణరావు, రౌతు సహదేవుడు, దువ్వ సూరిబాబు, చిదంబరం, సిరి కృష్ణ, తిరగిటి సత్యనారాయణ, పబ్లిక్ స్కూల్ మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

12న జీ తెలుగులో డ్రామా జూనియర్స్ సీజన్ -8

విశాలాంధ్ర/రాజమహేంద్రవరం: జీ తెలుగు డ్రామా జూనియర్స్ కొత్త సీజన్ 8 ఈ నెల 12న ప్రారంభం కానుందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. సంవత్సరాల నుంచి ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న డ్రామా జూనియర్స్ 8వ సీజన్‌తో మరోసారి ప్రేక్షకులకు వినోదం పంచేందుకు సిద్ధమైందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పిల్లల్లో దాగున్న నటనా ప్రతిభను వెలికితీసే ఉద్దేశ్యంతో కొత్త సీజన్ని ప్రారంభిస్తోందన్నారు. ఈ షోకు ఎనర్జిటిక్ యాంకర్ సుధీర్ హోస్ట్ చేయనుండగా, ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి, నటి రోజా న్యాయనిర్ణేతలుగా వ్యవహరించనున్నారు. అనిల్ రావిపూడి జీ తెలుగు డ్రామా జూనియర్స్ 8 షో ద్వారా బుల్లితెరపై మొదటిసారిగా న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తున్నారు. డ్రామా జూనియర్స్ సీజన్ 8 గ్రాండ్ లాంచ్ ఎపిసోడ్ ముఖ్య అతిథులుగా ప్రముఖ నటులు జగపతి బాబు, ఆమని హాజరవుతారు. ఈ సీజన్లో పాల్గొనే చిన్నారులు రెండు జట్లు బాయ్స్ టీమ్, గర్ల్స్ టీమ్‌గా తలపడనున్నారు. గర్ల్స్ టీమ్‌కి యాంకర్ లాస్య, బాయ్స్ టీమ్ కి త్రినయని సీరియల్‌తో జీ తెలుగు ప్రేక్షకులను అలరించిన నయని మెంటర్లుగా వ్యవహరిస్తున్నారు.

మౌలిక సదుపాయాల అమలుపై సమీక్ష

విశాలాంధ్ర -భీమవరం: అత్యధికంగా రొయ్యల సాగు చేస్తున్న పశ్చిమగోదావరి జిల్లాను అమెరికా ఆంక్షలు నుండి సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అనువైన చర్యలను ప్రభుత్వానికి నివేదిస్తామని 20 సూత్రాల కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ లంక దినకర్ తెలిపారు. గురువారం భీమవరం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ పశ్చిమ గోదావరి జిల్లాలో కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రాజెక్టుల అమలు పురోగతి, మౌలిక సదుపాయాలకు సంబంధించిన అంశాపై కలెక్టర్ చదలవాడ నాగరాణి సమన్వయంతో సమీక్షించారు. కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, శాసన సభ్యులు పులపర్తి రామాంజనేయులు, ఎంఎల్సీ వంకా రవీంద్రనాథ్, వివిధ శాఖల అధికారులు ఈ సమీక్షకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిదారులు పూర్తిస్థాయిలో సంతృప్తి పొందినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పం వికసితభారత్ 2047 - ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి ధ్యేయం స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంతో నిర్దేశించే కార్యాచరణ ద్వారా పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో ఇప్పుడున్న సమస్యలను అధిగమించి విజయవంతంగా 'వికసిత పశ్చిమ గోదావరి జిల్లా'గా రూపుదిద్దే స్ఫూర్తితో ఈ రోజు విజయవంతంగా సమీక్ష జరిగిందన్నారు. సమీక్షలో ఉపాధిహామీపథకం ప్రస్తుత అమలు తీరు, మెటీరియల్ కాంపోనెంట్ వినియోగం 2019-24 మధ్య జరిగిన అవకతవకల పైన, జిల్లాలోని ప్రతి గ్రామ పరిధిలోని ప్రతి గృహానికి సురక్షిత తాగు నీరు కుళాయి ద్వారా ఇచ్చే సంకల్పంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న జల్‌జీవన్‌మిషన్ అమలు తీరు పైన, 2019 - 24 మధ్య జిల్లాలో స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం 2015-16లో అమృత్ పథకం క్రింద ఇచ్చిన నిధుల వినియోగంతో సాధించిన ఫలితాలు పనులలో మందగమనం, అమృత్ 2.0 లక్ష్యాల పైన, గ్రామీణసడక్‌యోజన, లాక్ పతి దీదీ, గరీబ్ కళ్యాణ్ అన్నయోజన, పీఎంసూర్యఘర్, కుసుమ్, పీఎం ఆవాసయోజన, టిడ్కో గృహాలు, పీఎం విశ్వకర్మ యోజన వంటి కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు తీరుతో పాటు ఆక్వా రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను మరియు పురోగతి పైన జిల్లా కలెక్టర్ మరియు అధికారులతో చర్చించారు. ఈ సంవత్సరం ఉపాధి హామీలో మెటీరియల్ కాంపోనెంట్ వినియోగించు కోదగిన నిధులలో 44.82 కోట్లు చెల్లింపులు జరిగాయనీ, మరో 30 కోట్లు పనులకు చెల్లింపులు జరగవలసి ఉందన్నారు. ' గ్రామీణ సడక్ యోజన' కింద గ్రామాలలో రహదారుల నిర్మాణ పనులు వేగంగా జరగాల్సినటువంటి అవసరం ఉందని అధికారుల దృష్టికి తేవడం జరిగింది. జిల్లాలోని మొత్తం 45.09 కిలోమీటర్లకు సంబంధించిన 8 పనులకు సంబంధిచి దాదాపు 52.08 కోట్ల అంచనా వ్యయం, 3 పనులు పూర్తయ్యాయని, 4 పనులు జరుగుతున్నట్లు మరియు 1 పని ప్రారంభం కానట్లు అధికారులు తెలిపారు.